# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 66 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | ఆదివారం 27 ఏప్రిల్ 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 66 27-04-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-





కుంట్లూరులో భారీ అగ్ని ప్రమాదం

-400 గుడిసెలు దగ్ధం

3 లో..



## కొత్త పోప్ ఎన్నికలో నలుగురు భారతీయులు

**న్యూఢిల్లీ ఏప్రిల్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

పోప్ ఫ్రాన్సిస్ మరణించినప్పటి నుంచి వాటికన్ సిటీకి కాబోయే అధిపతి ఎవరనే ఆసక్తి ప్రపంచ వ్యాప్తంగా నెలకొంది. అయితే, పోప్ అస్తమించిన నాటి నుంచి తొమ్మిది రోజుల వరకూ వాటికన్ లో సంతాప దినాలుగా పాటిస్తారు. పురాతన రోమన్ కాలం నుంచి కొనసాగుతున్న ఈ ఆచారాన్ని నోవెండియేల్ అని పిలుస్తారు. ఆ తర్వాతే నూతన పోప్ ఎన్నికకు సన్నాహాలు మొదలవుతాయి. ఎన్నిక రోజున కాన్‌క్లేవ్‌లో అర్హత పొందిన కార్డినల్స్ రహస్య ఓటింగ్ విధానంలో తదుపరి పోప్ ను ఎంపిక చేస్తారు. ఇప్పటికే ప్రపంచంలోని నలుమూలల నుంచి పోప్ అంత్యక్రియల కోసం కార్డినల్స్ వాటికన్ సిటీకి చేరుకుంటున్నారు. అయితే, పాపల్ కాన్‌క్లేవ్‌లో ఓటు వేయడానికి ప్రస్తుతం అర్హత 135 మంది కార్డినల్స్‌కు అర్హత ఉంది. వీరిలో నలుగురు భారతీయులు కార్డినల్ ఫిలిప్ నెరి ఫెర్రావ్, కార్డినల్ బసేలియోస్ క్లీమిస్, కార్డినల్ ఆంథోనీ పూల, కార్డినల్ జార్జ్ జాకబ్ కూవకాడ్ ఉన్నారు. వాటికన్ సిటీ అధిపతి, 135 కోట్ల క్యాథలిక్కులకు నాయకుడిని ఎంపిక చేయడంలో కీలకంగా వ్యవహరించనున్నారు.

- తరువాయి 2లో..

## టిడిపి హయాంలోనే.. మత్స్యకారుల సంక్షేమం

- ముఖ్యమంత్రి చంద్రబాబు
- బుడగట్లపాలెంలో 'మత్స్యకారుల సేవలో..' కార్యక్రమం ప్రారంభం



**శ్రీకాకుళం ఏప్రిల్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

రాష్ట్రంలో తెలుగుదేశం అధికారంలోకి వచ్చిన తరువాతే మత్స్యకారులకు సంక్షేమ ఫలాలు అందుబాటులోకి వచ్చాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. టిడిపి ఆవిర్భావం నుండి బీసీలంతా టిడిపి వెంట నడిచారని, బీసీలలో ప్రధానమైన మత్స్యకారులు కూడా టిడిపికి వెన్నుదన్నుగా నిలిచారని అన్నారు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నియోజకవర్గం బుడగట్లపాలెం గ్రామంలో శనివారం నాడు సిఎం చంద్రబాబు 'మత్స్యకారుల సేవలో..' పథకం ప్రారంభించారు. వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ఇచ్చే భృతిని రూ.10 వేల నుంచి రూ.20 వేలకు ప్రభుత్వం పెంచింది. మత్స్యకారులకు రూ. 258 కోట్లు నిధులను ప్రభుత్వం విడుదల చేసింది.
ఈ నిధుల పంపిణీ

- తరువాయి 2లో..



## తిరుమలకు పెరిగిన భక్తుల రద్దీ..

### అలిపిరి వద్ద భారీగా నిలిచిన వాహనాలు



**అలిపిరి ఏప్రిల్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

వేసవి సెలవులు, వారాంతం నేపథ్యంలో తిరుమలకు భక్తుల రద్దీ భారీగా పెరిగింది. శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద వాహనాలను తనిఖీ చేసే ప్రక్రియ ఆలస్యం అవుతోంది. దీంతో వాహనాలు గరుడ కూడలి వరకు నిలిచిపోయాయి. భక్తులు గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. దర్శనానికి, వివిధ సేవలకు ముందస్తుగా టికెట్లు పొందిన వారు ఇబ్బందులు పడుతున్నారు. సమయం దాటితే తమను సేవలకు అనుమతించరంటూ వాపోతున్నారు. %తనిఖీ కేంద్రం వద్ద 45 మంది ఎస్పీఎఫ్ సిబ్బంది, 15 మంది విజిలెన్స్ సిబ్బంది ఉన్నారు. ఈ సంఖ్యను పెంచితే తనిఖీ త్వరితగతిన అవుతుందని భక్తులు భావిస్తున్నారు.

## మన పక్షాన ప్రజలు ఉన్నారు:జగన్


**తాడేపల్లి ఏప్రిల్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఎంతటి తప్పుడు కేసులు నమోదు చేసినా, ఎంతటి ఇబ్బందులు తేవడాన్ని యత్నించినా తాను కానీ, పార్టీ శ్రేణులు కానీ ఏమాత్రం భయపడబోమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. వైసీపీ రాజకీయ వ్యవహారాల కమిటీ (%పాూజ%) సమావేశంలో పాల్గొని ఆయన పార్టీ శ్రేణులకు చెప్పారు. జగన్ మాట్లాడుతూ, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో నన్ను అన్యాయంగా 16 నెలల పాటు జైలులో ఉంచారు. పార్టీని నడిపించలేని పరిస్థితులు తీసుకొచ్చారు. అయినా ప్రజలు నమ్మికతో నన్ను ఆదరించారు. ఉప ఎన్నికల్లో అనూహ్యమైన విజయాన్ని అందించారు, అని చెప్పారు. ఇప్పుడు కూడా ప్రభుత్వ అణచివేత చర్యలు ఏమాత్రం తమ ప్రయాణాన్ని ఆపలేవని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇప్పుడు ప్రతి గ్రామంలో మన పార్టీ ఉంది. వాళ్లు ఎన్ని కేసులు పెడితే ప్రజలు అంత తీవ్రంగా స్పందిస్తారు.
నన్ను మరోసారి జైలుకు పంపినంత

- తరువాయి 2లో..

## జూన్ నుంచి మానస సరోవర యాత్ర



**న్యూఢిల్లీ ఏప్రిల్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే కైలాస్ మానస సరోవర యాత్ర 2025 జూన్ నుంచి ఆగష్టు వరకు జరుగనుంది. ఈ సంవత్సరం, ప్రతి బ్యాచ్‌లో 50 యాత్రికులు ఉండేలా 5, 10 మందితో బ్యాచ్‌లు ఏర్పాటు చేసుకోవాలని సూచించింది.
ఈ మేరకు శనివారం కేంద్ర విదేశాంగ

- తరువాయి 2లో..

## ఏనుగుల దాడిలో వ్యక్తి మృతి

### -పరిహారం ప్రకటించిన పవన్ కళ్యాణ్



**తిరుపతి, ఏప్రిల్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

తిరుపతి జిల్లా చిన్నగొట్టిగల్లు మండలం దాసరిగూడెం గ్రామానికి చెందిన 72 ఏళ్ల ఆర్.సిద్దయ్య అనే వ్యక్తి ఏనుగుల దాడిలో దుర్మరణం చెందాడు. సిద్దయ్య మృతికి ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సంతాపం తెలిపారు. కుటుంబ పెద్దను పోగొట్టుకున్న వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ క్లిష్ట సమయంలో ఆ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.10 లక్షల రూపాయల పరిహారం ఇస్తున్నట్టు ప్రకటించారు. ఏనుగుల సంచారాన్ని, వాటి కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సమీప గ్రామ ప్రజలకు సమాచారాన్ని అందించేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టామని అన్నారు. భవిష్యత్తులో ప్రజలకు వన్యప్రాణుల నుంచి ఎలాంటి ప్రమాదాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను పవన్ కల్యాణ్ ఆదేశాలు జారీ చేశారు.

**కోనసీమ ప్రమాదంపై ఆవేదన**

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అవిడి గ్రామం వద్ద ఈ రోజు చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో తొమ్మిదిమంది మహిళ ఉపాధి హామీ శ్రామికులు గాయాల పాలైన ఘటన తెలిసి ఆవేదన చెందానని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. తక్షణమే వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. గాయపడిన వారికి చికిత్స అందించడంపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించే బాధ్యతలను ఒక అధికారికి అప్పగించాలని అన్నారు. జిల్లా యంత్రాంగం పరిశీలించి, ఆర్థిక సహాయం అందించే చర్యలు చేపట్టాలని చెప్పారు. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్‌ను పవన్ కల్యాణ్ ఆదేశించారు.

## తుది ఘట్టానికి ఆపరేషన్ కగార్

### -కర్రెగుట్టల్లో తూటాల మోత

**ఛత్తీస్‌ఘడ్ ఏప్రిల్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

తెలంగాణ – ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని కర్రెగుట్టల్లో ఆపరేషన్ కగార్ కొనసాగుతోంది. మావోయిస్ట్ గెరిల్లా సుప్రీం కమాండర్ హిడ్మా టార్గెట్‌గా సెర్చ్ ఆపరేషన్ జరుగుతోంది. కర్రెగుట్టల్లో బంకర్‌లో సాయుధదళంతో హిడ్మా ఉన్నట్లు నిఘా వర్గాల సమాచారం. హిడ్మా వేటలో నాలుగు హెలికాప్టర్లు, 20 మానవ రహిత వైమానిక వాహనాలు, యూఏవీలు, రెండు డ్రోన్ స్వాడ్రన్‌లు, ఎన్‌టీఆర్‌వో శాటిలైట్ చిత్రాలు, మ్యాప్స్‌తో సెర్చ్ ఆపరేషన్ చేస్తున్నారు. రాయపూర్ జగధల్‌పూర్ నుంచి ఈ ఆపరేషన్‌ను సీఆర్పీఎఫ్ డైరెక్టర్ జనరల్ జీపీ సింగ్ పర్యవేక్షిస్తుండగా... వార్‌జోన్‌లో బస్తర్ ఐజీ సుందర్ రాజ్ మానిటర్ చేస్తున్నారు.



గత ఐదు రోజులుగా కర్రెగుట్టల్లో ఆపరేషన్ కగార్ కొనసాగుతోంది. కేంద్రం ఆధ్వర్యంలో నడుస్తున్న భద్రతా బలగాలు దాదాపు ఐదారు కిలోమీటర్ల మేర లోపలకు చొచ్చుకుని వెళ్లి మరీ సెర్చ్ ఆపరేషన్ చేస్తున్నారు. మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా బాంబుల వర్షం కురిపిస్తూ భద్రతాబలగాలు దూసుకెళ్తున్నాయి. ఈ క్రమంలో శనివారం కర్రెగట్టల్లో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో దాదాపు 38 మంది మావోయిస్టుల చనిపోయినట్లు సమాచారం. అయితే దీన్ని అధికారికంగా ధృవీకరించాల్సి ఉంది. అధునాతమైన డ్రోన్ల ద్వారా మావోయిస్టుల కదలికలను గుర్తించారు భద్రతాబలగాలు. మావోయిస్టుల కదలికలపై
ఫిబ్రవరిలో తీసిన డ్రోన్ విజువల్స్‌ను

- తరువాయి 2లో..

## పర్యాటకం, ఆతిథ్య రంగాలపై ఏపి సర్కారు కీలక నిర్ణయం

- మిగతా 2 లో..

# సంపాదకీయం

## తీవ్రవాదులను ఓడిద్దాం... దేశాన్ని గెలిపిద్దాం!

కేవలం పహల్‌గామ్‌లోనే కాదు, కేవలం పాకిస్తాన్‌లోనే కాదు, దేశమంతా ఉన్నారు. అవకాశవాద, అవినీతిలో నిండిన ప్రజా, సివిల్ అధికారుల వల్లనే టెర్రరిస్టులు బతుకుతున్నారు, టెర్రరిజం బతుకుతున్నది. టెర్రరిస్టు డబ్బుతో ఆ దేశం, ఈ దేశం అనికాదు, ప్రతి బిజినెస్‌లో పెద్దలు, నేతలు బతుకుతున్నారు. సిగ్గు సిగ్గు! రాబోయే పదేళ్లదాకా, లేదా వందేళ్లదాకా తీవ్రవాదం ఉంటుంది, ఉంచుతారు. వ్యాపారం కోసం, రాజకీయం కోసం! అధికారం కోసం, ఎన్నికల కోసం!

అంతర్జాతీయంగా అన్నీ అమ్ముకోవడాలే గాని, జాతీయతా భావనే లేదు. నాయకులకే కాదు, సగం మంది ప్రజలకు కూడా సిగ్గు పడవలసిన 'దుర్మార్గం' ఎక్కువగా ఉంది. గుడికి దర్శనానికి వెళుతున్నాం. ప్రసాదాలను, నిజాలను నమ్ముకోకుండా, ఖనిజాలు అమ్ముకుంటున్నాం. ఆ ఖనిజం కోసం అడవులు నరికేస్తున్నాం. 'సత్యమేవ జయతే' అని మన జాతీయ నినాదం. 150 కోట్ల జనాల్లో ఎంతమంది నిజం చెబుతున్నారు? 'రామ్ నామ్ సత్య్ హై' అనేది మనదేశంలో చిత్తశుద్ధితో వినేవారున్నారా? రామ్ పేరుతో రాజకీయాలు, మతం పేరుతో అధికారాలతో ఆడు కుంటూ, పై పెదవుల కొస నుంచే 'జై శ్రీరామ్' అంటున్నాం. రామరాజ్యం రావడం లేదు. భక్తి లేదు, భయం లేదు. గర్భగుడులలో ఒక్కొక్క స్తంభానికి బంగారపు తాపడాలకు డబ్బిస్తాం కానీ పేదవాడికి తిండిచ్చేవాడు లేదు. అమెరికాలో అద్భుత ఆకాశాలను తాకే రెండు భవనాలను విమానాల్లో కూల్చిన దుర్మార్గం ద్వారా వందలాది జీవనాలు ధ్వంసమయ్యాయి(2001 సెప్టెంబర్ 11). నిన్న పహల్‌గామ్‌లో 26 మంది ప్రాణాలు తీసిన నేరం చిన్నదేం కాదు. వెంటాడి వేటాడి ఒక్కొక్కణ్ణి పట్టుకు శిక్ష వేస్తాం అంటున్న ప్రభుత్వానికి వందలాది వందనాలు. అమెరికా చేసిందేమిటి? మాటలు కాదు. తూటాలు కాదు. రాజకీయం కాదు. ఎక్కడున్నా సరే వేటాడి పట్టుకుని అమెరికాను కాపాడుకోవడానికి చూపిన కమిట్‌మెంట్ మనకు ఆదర్శం కావాలి. కమిట్‌మెంట్ అంటే కట్టుబాటు, దీక్ష. అకుంఠిత దీక్ష కావాలి. అది ఉందా? ఒక్కో మరణానికి కన్నీటి బిందువునైనా ఇచ్చుకున్నామా? క్రికెట్ మైదానంలో ఓ రెండు క్షణాలు నిలబడితే చాలా? కోట్ల కోట్ల వ్యాపారం కోసం, ప్రచారం కోసం మౌనమే సరిపోతుందా? ఒక్కో ప్రాణానికి, ఒక్కో సైనికుడి జీవనానికి డబ్బు ఇచ్చే దమ్ముందా?

రాజ్యాంగాన్ని మార్చుకున్నారు. జమ్మూ కశ్మీర్ రాష్ట్రాన్ని కేంద్రపాలితం చేశారు. అంటే జరిగినదానికి రాష్ట్ర బాధ్యత లేదు, కేంద్ర ప్రభుత్వానిదే బాధ్యత. టూరిస్టులయిన మామూలు మనుషుల్ని టెర్రరిస్టులకు బలిచేసిన ప్రభుత్వానికి బాధ్యత లేదా? పాకిస్తాన్, బంగ్లాదేశ్‌తో పాటు, మరికొన్ని భూభాగాలతో అఖండ భారత్ అనే నినాదాలు చేసే పెద్దలు... పక్కనున్న టెర్రరిస్టులు, మన నేల మీద మన వారిని చంపేస్తుంటే ఏం చేస్తున్నట్టు? పదేళ్ల ముందు దద్దమ్మలని పాత పాలకులను తిట్టి పోశాం. యూపీఏ చెత్త పరిపాలన వల్ల తీవ్రవాదులు జనాన్ని చంపేస్తున్నారన్నారు. మరి ఇప్పుడు 2025 దాకా ఏం చేస్తున్నట్టు? ఇప్పుడు మనకు నేతాజీ సుభాష్ చంద్రబోస్ వంటి మహానాయకుడు అవసరం. ప్రతి సైనికుడిని ఒక శక్తిగా మార్చి, తుపాకీలు ఎక్కుపెట్టినట్టే మహా ధైర్యంగా, రాజకీయ నాయకులను కూడా ప్రశ్నించి, నిజం చెప్పి, వ్యూహం నేర్పి భారత దేశాన్ని గెలిపించిన (1971 ఇండో%-%పాక్ యుద్ధం) ఫీల్డ్ మార్షల్ మానెక్‌శా వంటి సైన్యాధిపతులు మనకు అవసరం. ఆ విధంగా మన దేశాన్ని గెలిపిద్దాం. తీవ్రవాదులను మట్టి కరిపిద్దాం. చెత్త రాజకీయాలు కాదు, మన కైలాస హిమాలయాలున్న మన కశ్మీర్‌ను గెలిపిద్దాం. మన రాజ్యాన్ని, రాజ్యాంగాన్ని, రాజనీతిని నిలబెడదాం.

## టిడిపి హయాంలోనే.. మత్స్యకారుల సంక్షేమం






కార్యక్రమం సిఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా గ్రామంలోని పలు మత్స్యకార కుటుంబాలతో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ అయ్యారు. మొదట సముద్ర తీరంలో మత్స్యకార కుటుంబం మద్దు పోలేష్, రామలక్ష్మీతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం కారి రాంబాబు, ఉప్పాడ సీతోగ్య, చింతపల్లి ఎర్రయ్యతో ముచ్చటించారు. అనంతరం ఎండుచేపలను పరిశీలించి మద్దు లక్ష్మమ్మ, కారి సీతమ్మ, వారధి పైడమ్మతో మాట్లాడి చేపలు ఎండబెట్టే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. రోజువారీ ఆదాయం గురించి తెలుసుకున్నారు. కమ్యూనిటీ హాల్‌కు చేరుకున్న సీఎం... చేపల బోట్లు మరమ్మతులు చేసే కార్మికులు మైలపల్లి పోతురాజు, కారి రాంబాబుతో కాసేపు సంభాషించారు. చేపలు నిల్వ చేసుకునే ఐస్ బాక్సులు, చేపలు పట్టే వలలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ టీడీపీకి వెనుకబడిన వర్గాలే వెన్నెముక అన్నారు. "స్థానికుల సమస్యలు, పేదల కష్టాలు చూశాను. రాత్రివేళ మత్స్యకారులు సముద్రంలోకి వెళ్తున్నారు. కొందరు బోట్ల ద్వారా జాలర్ల సగం ఆదాయం కాజేస్తున్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాతే జాలర్ల దశ,దిశ మారింది" అన్నారు. మత్స్యకార గ్రామాలు ఒకే మాటపై ఉండి కట్టడిగా ఉంటారని ఆయన అభినందించారు. వెనుకబడిన వర్గాల కోసం మరిన్ని కార్యక్రమాలు చేపడతామని ప్రకటించారు. మత్స్యకారుల జీవితాల్లో వెలుగు నింపేందుకు ఎన్డీఏ మీ వెంటే ఉంటుందని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో రూ.10 లక్షల కోట్లు అప్పులు చేశారని, ఆ రుణాలతో ఏం చేశారో లెక్కలు కూడా లేవన్నారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా మీ సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. "హైదరాబాద్ వెళ్లినా.. ఢిల్లీ వెళ్లినా శ్రీకాకుళం కాలనీ ఉంటుంది. ఆర్మీలో ఎక్కువగా పని చేసేవారు శ్రీకాకుళం వారే ఉంటారు. 26 జిల్లాల్లో తక్కువ తలసరి ఆదాయం శ్రీకాకుళం జిల్లాదే. శ్రీకాకుళం జిల్లాలో తెలివితేటలు, నాయకత్వానికి కొదవ లేదు. అన్ని వనరులు ఉన్నా శ్రీకాకుళం జిల్లా వెనుకబడి ఉంది. నదులు, సముద్ర తీరం, గనులు, హైవేలు ఎక్కువున్నాయి. జిల్లాను బాగుచేసే వరకు మళ్లీ మళ్లీ వస్తా.. మీకు అండగా ఉంటా" అని చంద్రబాబు హామీ ఇచ్చారు. "నేను కూడా బటన్ నొక్కవచ్చు.. కానీ మీ కష్టాలు తెలుసుకునేందుకే నేరుగా వచ్చా. ప్రభుత్వం బాధ్యతగా ఉండాలి.. ప్రజల ఆదాయం పెంచాలి. ప్రజల జీవన ప్రమాణాలను ప్రభుత్వం మెరుగుపర్చాలి" అన్నారు. శ్రీకాకుళం జిల్లాకు కింజరాపు కుటుంబం సేవలను చంద్రబాబు గుర్తు చేశారు. "గతంలో ఎర్రన్నాయుడు ఉద్దానం ప్రాంతానికి నీళ్లు సాధించారు. రామ్మోహన్ నాయుడు ఆధ్వర్యంలో భోగపురం విమానాశ్రయం పూర్తి కాబోతోంది. వారసత్వంగా వచ్చిన పనులే చేస్తూ పేదరికంలోనే బతకాలా.. ఉన్న అవకాశాలను ఉపయోగించుకుని ముందుకెళ్లాలి" అని కోరారు. "రాష్ట్రంలో 555 మత్స్యకార గ్రామాలున్నా.. మీ గ్రామానికే వచ్చాను. మీ గ్రామం దశ, దిశ మార్చాలి.. కష్టసుఖాలు అర్థం చేసుకోవాలి. రాష్ట్రానికి సందేశం ఇచ్చి అన్ని మత్స్యకార గ్రామాలను బాగు చేస్తాం" అని ప్రకటించారు. దేశంలో ఉత్పత్తయ్యే మత్స్యసంపదలో 29 శాతం ఏపీ నుంచే ఉంటుందని ఆయన చెప్పారు. ఏపీ నుంచి 32 శాతం మత్స్య సంపద ఎగుమతులు జరుగుతున్నాయని, మత్స్య ఉత్పత్తుల ద్వారా 16.50 లక్షల మందికి ఉపాధి లభిస్తోందని వివరించారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే చేపలు తప్ప మరో మార్గం లేదన్నారు. "మత్స్యకారుల పిల్లలను బాగా చదివించే బాధ్యత తీసుకుంటాం. ఇప్పటికే ఆరు రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటు చేశాం. ఎచ్చెర్లలో నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తాం. స్థానిక ఉద్యోగాలు ఈ ప్రాంత వాసులకే వచ్చేలా చర్యలు తీసుకుంటాం" అని చంద్రబాబు ప్రకటించారు. పేదలకు రూ.33 వేల కోట్ల పింఛన్లు ఇచ్చే ఏకైక రాష్ట్రం ఏపీ అన్నారు. మత్స్యకారుల జీవన ప్రమాణాల మెరుగుకు ప్రణాళిక రూపొందిస్తామని ప్రకటించారు. రూ.1,990 కోట్లతో 9 షిప్పింగ్ హార్బర్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి ఆగిపోయిందని, టీడీపీ ప్రభుత్వం ఉండి ఉంటే రూ.7 లక్షల కోట్ల సంపద పెరిగి ఉండేదని అన్నారు. ప్రజల తలసరి ఆదాయం ఇంటికి రూ.50 వేల మేర పెరిగి ఉండేదని తెలిపారు. విశాఖ ప్రజల తలసరి ఆదాయం ఏపీలోనే అగ్రస్థానంలో ఉందన్నారు. ప్రజల తలసరి ఆదాయం పెరగాలి.. అందరూ సమానంగా ముందుకెళ్లాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు.

## కొత్త పోప్ ఎన్నికలో నలుగురు భారతీయులు

కార్డినల్ జార్జ్ జాకబ్ కూవకాడ్ (51), కార్డినల్ డీకన్ కాగా, కార్డినల్ ఫిలిప్ నేరి అంటోనియో సెబాస్టియావో డో రోసారియో ఫెర్రావ్(72) గోవా, డామన్ (భారతదేశం) మెట్రోపాలిటన్ ఆర్చ్ బిషప్, భారత కాథలిక్ బిషప్‌ల కాన్ఫరెన్స్, ఆసియా బిషప్‌ల సమావేశాల సమాఖ్యకు అధ్యక్షుడు. కార్డినల్ ఆంథోనీ పూల (63) హైదరాబాద్ మెట్రోపాలిటన్ ఆర్చ్ బిషప్. కార్డినల్ బాసెలియోస్ క్లీమిస్ తొట్టుంకల్ సైరో-మలంకర (భారతదేశం) త్రివేండ్రం మేజర్ ఆర్చ్ బిషప్, సైరో-మలంకర చర్చి సైనాడ్ అధ్యక్షుడు. ఏప్రిల్ 19 నాటికి 252 మంది కార్డినల్స్ ఉండగా కేవలం 80 ఏళ్లలోపు వారికే కొత్త పోప్‌ను ఎన్నుకునే సమావేశంలో ఓటు వేయడానికి అర్హులు. అలా చూస్తే ప్రస్తుతం 135 మంది ఓటు వేసే అర్హత ఉంది. నిబంధనల ప్రకారం వీరిలో కూడా 120 మందికే ఓటు వేసే హక్కు ఉంటుంది. శతాబ్దాలుగా పాటిస్తున్న సంప్రదాయం ప్రకారం ఈ సారి కార్డనల్లలో ఒకరిగా పోప్ గా ఎన్నుకుంటారు. ఓటింగ్ రోజున సిస్టీన్ చాపెల్ చిమ్నీ నుంచి నల్లటి పొగ వస్తే ఇంకా ఎంపిక పూర్తి కాలేదని, తెల్లటి పొగ వస్తే కొత్త పోప్ ఎన్నిక పూర్తయిందని అర్థం. ప్రస్తుతం పోప్ రేసులో ప్రధాన పోటీదారు పియట్రో పరోలిన్ (70), కాగా తర్వాతి స్థానంలో రాబర్ట్ ప్రివోస్ట్ (69) ఉన్నారు. పీటర్ ఎర్డో (72), మార్క్ ఓలెట్ (80), రీన్‌హార్డ్ మార్క్స్ (71), క్రిస్టోఫ్ షోన్‌బోర్న్ (80), మ్యాటియో జుప్పీ (69), లూయీ ట్యాగిల్ (67) పోప్ పదవికి పోటీ పడబోతున్నారు.

## మన పక్షాన ప్రజలు ఉన్నారు:జగన్

మాత్రాన ప్రజా వ్యతిరేకతను అణచివేయలేరు అని అన్నారు. గతంలో అక్రమాస్తుల కేసులో తనను అన్యాయంగా ఇరికించి జైలుకు పంపినా, ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో ప్రజలు వైసీపీకి అఖండ విజయాన్ని అందించారని జగన్ గుర్తుచేశారు. అదే విధంగా, ఇప్పుడు కూడా ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా, ఎన్ని కేసులు బనాయించినా ప్రజల మద్దతు తమకే ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి చర్యలు ఎదురైనా ఎదుర్కొనేందుకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని జగన్ ఈ సమావేశం ద్వారా సంకేతాలు పంపారు. ప్రభుత్వ చర్యల వల్ల ప్రజల్లో వ్యతిరేకత పెరిగి, అది అంతిమంగా తమ పార్టీకే లాభిస్తుందని అభిప్రాయపడ్డారు. ప్రతి కార్యకర్త ప్రజల మధ్య గళమెత్తి ప్రభుత్వ వైఖరిని బహిర్గతం చేయాలని పిలుపునిచ్చారు.

### జూన్ నుంచి మానస సరోవర యాత్ర

మంత్రిత్వ శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. యాత్రికులు ఉత్తరాఖండ్ రాష్ట్రం ద్వారా లిపులేఖ్ పాస్ దాటి, అలాగే సిక్కిం రాష్ట్రం ద్వారా నాథులా పాస్ దాటి ప్రయాణించేందుకు ఏర్పాట్లు చేసింది. యాత్రికుల నుంచి దరఖాస్తుల స్వీకరణ కోసం కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ %ఎఎ.స్త్రశీజ.అఅ% వెబ్‌సైట్ ప్రారంభించింది. యాత్రికులను, న్యాయమైన, కంప్యూటర్ ఆధారిత, లింగ సమతుల్య ప్రక్రియ ద్వారా దరఖాస్తుదారుల నుంచి ఎంపిక చేస్తారని కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. అభ్యర్థుల సమాచారం కోసం లేఖలు లేదా ఫ్యాక్స్‌లు పంపాల్సిన అవసరం లేదని పేర్కొంది. వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న ఫీడ్‌బ్యాక్ ఎంపికల ద్వారా సమాచారం పొందడం, అభిప్రాయాలను నమోదు చేయడం లేదా అభివృద్ధి కోసం సూచనలు ఇవ్వడం చేయవచ్చని కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది.

### తుది ఘట్టానికి ఆపరేషన్ కగార్ -కర్రెగుట్టల్లో తూటాల మోత

బయటకు వచ్చాయి. పెద్ద సంఖ్యలో మావోయిస్టులు కర్రెగుట్టల్లో ఎక్కుతున్న డ్రోన్ దృశ్యాలను పోలీసులు విడుదల చేశారు. దీంతో మావోయిస్టులు పెద్దఎత్తున కర్రెగుట్టల్లో తలదాచుకున్నట్లు ఈ డ్రోన్ దృశ్యాల ద్వారా స్పష్టమవుతోంది. భారీ ఎత్తున బంకర్లను ఏర్పాటు చేసుకుని అందులోనే మావోయిస్టు రాష్ట్ర ఇన్‌చార్జ్ దామోదర్, హిడ్మా సహా తెలంగాణ క్యాడర్ అంతా కూడా కర్రెగుట్టల్లోనే ఉన్నట్లు తెలుస్తోంది. అయితే కర్రెగుట్టలు ఆపరేషన్‌ను నిలిపివేయాలని గత పదిరోజులుగా పౌరహక్కు సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. అంతే కాకుండా మావోయిస్టు పార్టీ నుంచి కూడా మూడు సార్లు లేఖలు విడుదలయ్యాయి. శాంతి చర్చలకు సిద్ధమంటూ లేఖలు విడుదల చేశారు. దీంతో శాంతిచర్చలకు కేంద్రం ముందుకు రావాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నారు. అయితే వీరి డిమాండ్లను పట్టించుకోకుండా భద్రతా బలగాలు ముందుకు దూసుకెళ్తున్నాయి. మావోయిస్టులను తుదముట్టించేందుకు పూర్తిస్థాయిలో భద్రతా బలగాలు కర్రెగట్టల్లో సెర్చ్ ఆపరేషన్‌ను కొనసాగిస్తున్నాయి. ఆదివాసీ గుడాల్లో కూడా బాంబుల శబ్దాలు వినిపిస్తున్నాయంటూ అక్కడి ప్రజలు అడవులను విడిచి భయటకు వస్తున్న పరిస్థితి. ఈ క్రమంలో ఆదివాసీలు కూడా ప్రాణాలు కోల్పోతున్నట్లు సమాచారం.ఈ ఆపరేషన్‌లో మావోయిస్టులే కాకుండా ఆదివాసీలు ప్రాణాలు కోల్పోతున్నారని పౌరహక్కు సంఘాల నేతలు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం శాంతి చర్చలకు ముందుకు రావాలని, అందుకు ఒక నెలరోజుల పాటు కాల్పుల విరమణ ప్రకటించాలని పౌరహక్కు సంఘాల నేతలు డిమాండ్ చేశారు. అయితే వీళ్ల డిమాండ్‌లను పట్టించుకోకుండా భద్రతా బలగాలు ముందుకు దూసుకెళ్తున్నారు. ఆపరేషన్ కగార్ చివరి అంకానికి చేరుకున్నట్లు తెలుస్తోంది. రెండు మూడు రోజుల్లోనే ఆపరేషన్ పూర్తి అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## పర్యాటకం, ఆతిథ్య రంగాలపై ఎపి సర్కారు కీలక నిర్ణయం

**అమరావతి ఏప్రిల్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

%అమరావతి : పర్యాటకం, ఆతిథ్య రంగాన్ని బలపరిచేలా ఎపి సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. బార్ల లైసెన్సు ఫీజు, నాన్ రిఫండబుల్ రిజిస్ట్రేషన్ ఛార్జీలను తగ్గించింది. ఏడాదికి బార్ల లైసెన్స్ ఫీజును రూ.5 లక్షలుగా నిర్ధారించింది. 3 స్టార్, పైస్థాయి హెూటళ్లలో రిజిస్ట్రేషన్ ఛార్జీని రూ.66 లక్షల నుంచి రూ.25 లక్షలకు కుదించింది. నాన్ రిఫండబుల్ ఛార్జీని రూ.20 లక్షలుగా నిర్ధారించింది. ఫీజులు తగ్గించాలన్న హెూటల్స్ అసోసియేషన్ విజ్ఞప్తి, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రతిపాదనల మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. స్టార్ హెూటళ్లు ఉన్నచోట బార్ లైసెన్స్‌ల జారీపై నియంత్రణ లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ ముఖ్యకార్యదర్శి ముఖేశ్ కుమార్ మీనా ఉత్తర్వులు జారీ చేశారు. సెప్టెంబరు 1 నుంచి ఇవి అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు.

# యువ సృష్టికర్తలకు ప్రోత్సాహం



వాణిజ్య సుంకాలు, స్టాక్ మార్కెట్ అస్థిరతలు ప్రపంచాన్ని వేధిస్తున్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ పురోగమిస్తూనే ఉంది. విస్తృత జనాభా, సాంకేతిక సామర్థ్యాలను సద్వినియోగం చేసుకుంటూ, సవాళ్లను అవకాశాలుగా మలుచుకుని ప్రపంచ 'క్రియేటివ్ పవర్ హౌస్'గా తనను తాను నిరూపించుకునే సత్తా భారత్‌కుంది. కథలు చెప్పడంలో మనకున్న సామర్థ్యాన్ని 'క్రియేట్ ఇన్ ఇండియా, క్రియేట్ ఫర్ ద వరల్డ్' విజన్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా సృష్టికర్తలను (క్రియేటర్స్) లక్ష్యంగా చేసుకుని భారత మీడియా-వినోద (ఎం అండ్ ఇ) రంగం ముందుకు సాగుతోంది. చలనచిత్రం, సంగీతం, కళ, సాంకేతికత వంటి వివిధ రంగాలలో యువ సృష్టికర్తలకు భారత్ నిలయంగా ఉంది. ముఖ్యంగా 'డ్యూన్-2' సినిమా ఆస్కార్ గెలుపునకు కారణమైన అద్భుత వీఎఫ్ఎక్స్‌ను అందించిన విజువల్ ఎఫెక్ట్స్, యానిమేషన్ స్టూడియోగా నమిత్ మల్హోత్రాకు చెందిన 'డీఎన్ఈజీ'ని చెప్పుకోవచ్చు. ఇది ప్రపంచ వినోద పరిశ్రమలో భారత్ ప్రాబల్యాన్ని తెలియచెబుతూ భారత్‌కు 7వ ఆస్కార్‌ను తెచ్చిపెట్టింది. సంప్రదాయ ఫిల్మ్ మేకింగ్ నుంచి డిజిటల్ నిర్మాణానికి మళ్ళుతూ ప్రపంచ స్థాయి కంటెంట్‌ను రూపొందించడంలో భారత్ సామర్థ్యాన్ని ఇది ప్రతిబింబిస్తోంది.

ముంబయి వేదికగా మే నెలలో భారత ప్రభుత్వం 'ప్రపంచ ఆడియో-విజువల్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ (వేవ్స్) - 2025'ను నిర్వహిస్తోంది. యువ సృష్టికర్తలను పరిశ్రమ దిగ్గజాల చెంతకు చేర్చడం, అంకుర సంస్థలను ప్రోత్సహించడం వేవ్స్‌లో భాగమైన వేవ్స్ ఎక్స్‌లేరేటర్ (వేవెక్స్) లక్ష్యం. యువ సృష్టికర్తలు అనుభవజ్ఞుల సలహాలు పొందేలా చూడటం, నిధుల లభ్యత, అంతర్జాతీయ అవకాశాలను అందించడం ద్వారా మీడియా, వినోద రంగాల్లో భారత అంకుర సంస్థల స్థాయిని పెంచడానికి వేవ్స్ కృషి చేస్తుంది. గేమింగ్, కృత్రిమ మేధ, మెటావర్స్ వంటి వినూత్న రంగాలపై దృష్టి సారిస్తూ... ఈ రంగం 2023లో రూ. 2,422 బిలియన్ల నుంచి 2027 నాటికి రూ.3,067 బిలియన్లకు పెరుగుతుందని అంచనా.

కొన్ని సవాళ్లు ఉన్నప్పటికీ, బ్రాహ్మణ్ గేమ్ స్టూడియోస్, కీబౌండ్, వాయన్ క్లౌడ్ వంటి అంకుర సంస్థలు ప్రపంచ పెట్టుబడిదారుల ముందు తమ నైపుణ్యాలను ప్రదర్శించడానికి వేవ్స్ ఒక వేదికగా ఉపకరిస్తుంది. వీటిలో మీడియా - వినోద రంగ సామర్థ్యాన్ని చాటే ల్యాప్‌విం‌గ్ స్టూడియోస్, వైగర్ మీడియా వంటి మహిళల నేతృత్వంలోని అంకుర సంస్థలు కూడా ఉన్నాయి. అంతర్జాతీయ స్థాయిలో అడుగు పెట్టడానికి ఒక పోటీతత్వ అంకుర సంస్థల వాతావరణాన్ని వేవ్స్ అందిస్తుంది.

పెట్టుబడులు పొందడానికి, అంతర్జాతీయ అరంగేట్రంలో ఇబ్బందులను తప్పించడానికి, మెంటార్‌షిప్ అడ్డంకులకు ఒక పరిష్కార వేదికగా నిలుస్తుంది. కేవలం రూ.10,000 పెట్టుబడితో ఒక విజన్‌తో 'బయోకాన్'ను ప్రారంభించిన నాకు ఇటువంటి ప్రోత్సాహక వేదికల ప్రాముఖ్యం ఏమిటో బాగా తెలుసు.

### క్రియేటివ్ హబ్

కళలంటే ఇష్టపడే నేను మ్యూజియం ఆఫ్ ఆర్ట్ అండ్ ఫొటోగ్రఫీ (మ్యాప్), సైర్ఫ్ ్ర గ్యాలరీ బెంగళూరు కార్యక్రమాలకు నా సహకారాన్ని అందిస్తూ ఉంటాను. ఒక దేశ సంస్కృతి దాని కళలు, శాస్త్రాలతో ముడిపడి ఉందని బలంగా నమ్ముతాను. కళలు, విజ్ఞాన శాస్త్రం రెండూ సృజనాత్మకతలో భాగమే. కళాకారులు వేదికపై ప్రదర్శించే విధంగానే శాస్త్రవేత్తలు ప్రయోగశాలల్లో ప్రయోగాలు చేస్తారు. కథలు చెప్పడంలో శతాబ్దాలుగా నైపుణ్యం కలిగిన భారత్... ప్రపంచ సృజనాత్మక శక్తిగా ఎదగడానికి గొప్ప అవకాశం ఉంది. శాస్త్రీయ నృత్యం నుంచి సినిమా వరకుబీ కామిక్స్ నుంచి ఇమ్మర్సివ్ టెక్నాలజీ వరకు, అధునాతన సృజనాత్మకత ఆవిష్కరణలతో ముడిపడి ఉన్న ఉత్తేజకరమైన యుగంలోకి ప్రవేశిస్తున్నాం. 'క్రియేట్ ఇన్ ఇండియా, క్రియేట్ ఫర్ ద వరల్డ్' అనే ఆలోచన ఈ ఆశయాన్ని సంపూర్ణంగా నెరవేరుస్తుంది.

### సృజనాత్మక అంకుర సంస్థలకు ఉత్ప్రేరకం

సాంకేతికత, కథ చెప్పడంలోని నైపుణ్యానికి వేవ్స్ ఒక ఉదాహరణగా నిలుస్తుంది. యానిమేషన్, ఏఐ, ఏఆర్/వీఆర్, గేమింగ్, మెటావర్స్ వంటి వినూత్న రంగాల్లో అంకుర సంస్థలకు మద్దతు ఇవ్వడం ద్వారా వేవెక్స్ తన ప్రాబల్యాన్ని చాటడానికి సిద్ధంగా ఉంది.వేవ్స్ బజార్‌లో 4,500కు పైగా అమ్మకందారులు, 5,900కి పైగా కొనుగోలుదారులు నమోదు చేసుకున్నారు. ఇది భారతీయ అంకుర సంస్థలను అంతర్జాతీయ సంస్థల చెంతకు చేర్చడం ద్వారా ప్రపంచ మీడియా, వినోద రంగాల్లో భారత్ పురోగమనాన్ని మరింత వేగవంతం చేస్తుందనడంలో ఎలాంటి సందేహమూ లేదు. సంప్రదాయ మీడియాకు మించిన ఆవిష్కరణలకు కూడా వేవ్స్ పెద్దపీట వేస్తుంది. కృత్రిమ మేధ ఆధారంగా తయారుచేసిన ప్రకటనల్లో ఎరుకానావిస్ టెక్నాలజీస్ వంటి కంపెనీలు అగ్రగామిగా ఉన్నాయి. అదే సమయంలో యానిమేషన్, వీఆర్ ద్వారా అమేజ్ స్టూడియోస్, ఆఫ్‌లైన్ హ్యూమన్ స్టూడియోలు కథను చెప్పే విధానాన్ని పునర్నిర్వచిస్తున్నాయి. ఇన్‌స్కేప్ ఎక్స్ఆర్, విజన్ ఇంపాక్ట్ వంటి ఎడ్%-%టెక్ వెంచర్లు ఇమ్మర్సివ్ మీడియాతో నేర్చుకునే విధానంలో మార్పులు తెస్తున్నాయి.

### భవిష్యత్ దృక్కోణం

మీడియా, వినోద రంగంలో ప్రపంచవ్యాప్తంగా పోటీపడేలా అంకుర సంస్థలను ప్రోత్సహించడానికి రూపొందించిన వేవ్స్ వంటి కార్యక్రమాలకు మద్దతునిచ్చే విషయంలో భారత ప్రభుత్వం నిబద్ధత స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పుడు మనం వేవ్స్ ద్వారా కేవలం అంకుర సంస్థల్లో పెట్టుబడి పెట్టడమే కాదు, కథను చెప్పే, స్వీయ%-%వ్యక్తీకరణ, భవిష్యత్తును నిర్వచించే సృజనాత్మక ఆర్థిక వ్యవస్థలోనూ పెట్టుబడి పెడుతున్నాం. అది బయోటెక్ ల్యాబ్ కావొచ్చు, డిజిటల్ స్టూడియో కావొచ్చు... సృజనాత్మకత అనేది రేపటి పరిశ్రమలు, గుర్తింపులను రూపొందించే ఒక సాధనం. వేవ్స్-2025 భారతదేశపు మీడియా, వినోద పరిశ్రమలకు సంబంధించిన వేడుకే కాదు... ఇప్పటి వినోదం, విద్య, సంస్కృతుల్లో సమూల మార్పులు తెచ్చేందుకు సిద్ధంగా ఉన్న ప్రపంచంలో తదుపరితరం సృష్టికర్తలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పరిచయ వేదిక.ఈ ప్రయాణంలో వేవ్స్ సలహా సంఘంలో నేనూ ఒక సభ్యురాలైనందుకు ఎంతో గర్వపడుతున్నాను. ప్రపంచ సృజనాత్మక విప్లవానికి నాయకత్వం వహించడానికి భారత్ సిద్ధమవుతున్న క్షణమిది. 'భారత్‌లో సృష్టిద్దాం%-% ప్రపంచం కోసం సృష్టిద్దాం' అంటూ అనంత కాల్పనిక శక్తిని ప్రపంచానికి పరిచయం చేద్దాం.

## పందూరు బ్రిడ్జి పనులకు
# శంకుస్థాపన చేసిన హోంమంత్రి అనిత





**కోటవురట్ల ఏప్రిల్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

కోటఉరట్ల మండలం పందూరు బ్రిడ్జి పనులకు హెూం మంత్రి అనిత శంకుస్థాపన చేశాను. గత కొన్నేళ్లుగా మూడు గ్రామాల ప్రజలు బ్రిడ్జి లేక పడుతున్న కష్టాలకు నేటితో తెర పడింది. రూ.5.75 కోట్లతో బ్రిడ్జి పనులు శనివారం ప్రారంభించారు. దీంతో పందూరు, పాతగొట్టివాడ ములగలలోవ గ్రామాల ప్రజలు ఆనందంలో మునిగి తేలారు. ప్రజల ప్రతి కష్టాన్ని తీర్చేందుకు కూటమి ప్రభుత్వం ప్రతి క్షణం ముందుంటుందని హెూం మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు లాలం కాశి నాయుడు, జానకి శ్రీను, గెడ్డం బుజ్జి, శ్రీను, భాస్కరరావు కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# కుంట్లూరులో భారీ అగ్ని ప్రమాదం

## -400 గుడిసెలు దగ్ధం

**హైదరాబాద్ ఏప్రిల్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

హయత్‌నగర్ కుంట్లూరులో శనివారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. రావి నారాయణ రెడ్డి నగర్‌లో పేదల గుడిసెలకు మంటలు అంటుకున్నాయి. దీంతో పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. మంటలు భారీగా ఎగసిపడటంతో స్థానిక ప్రజలు భయంతో తమ తమ గుడిసెల్లోంచి బయటకు పరుగులు తీశారు. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది.. హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకున్నారు. 4 ఫైరింజన్ల సహాయంతో మంటలను అదుపు చేశారు. సిలిండర్లు పేలడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు నిర్ధారించారు.

ప్రమాదంపై జిల్లా ఫైర్ ఆఫీసర్ కేశవులు మాట్లాడారు. తమకు గంట క్రితం ఫైర్ స్టేషన్‌కి కాల్ వచ్చిందని, కుంట్లూరు రావి నారాయణరెడ్డి కాలనీ సమీపంలో గుడిసెలు తగలబడిపోతున్నాయని సమాచారం ఇచ్చారని తెలిపారు. వెంటనే ఎల్బీనగర్, హయత్‌నగర్‌లోని తమ సిబ్బందిని అలర్ట్ చేసి 5 ఫైర్ ఇంజిన్లను పంపించామన్నా. సుమారుగా 300 నుంచి 400 వరకు గుడిసెలు దగ్ధమైనట్లు తెలిపారాయన. ఇప్పటి వరకు దాదాపుగా మంటలు అదుపులోకి వచ్చాయని, మరో 2 ఫైరింజన్లు వస్తున్నాయని ఫైర్ ఆఫీసర్ కేశవులు తెలిపారు.

అబ్దుల్లాపుర్‌మెట్ ఎమ్మార్వో సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. కుంట్లూరు రెవెన్యూ పరిధిలో రావి నారాయణరెడ్డి కాలనీ సమీపంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుందని సమాచారం వచ్చింది. తాము కూడా ఫైర్ సిబ్బందికి సమాచారం అందించాము. ఎన్ని గుడిసెలు తగలబడ్డాయి, ఎంత ఆస్తి నష్టం జరిగిందనేది అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక ఇస్తాం. ప్రమాదానికి గల కారణాలు పోలీసులను అడిగి తెలుసుకుని నివేదిక ఇస్తామని తెలిపారు. ప్రత్యక్ష సాక్షి సైదులు మాట్లాడుతూ.. "అంబేద్కర్ చౌరస్తా వద్ద ఒక గుడిసెలో మొదటగా మంటలు చెలరేగాయి. దాని

తగలబడిన గుడిసెలో ఇంట్లో ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. గుడిసెలో దేవుడి పూజ కోసం దీపం మంటలు అంటుకోవడంతో ఘటన జరిగినట్టు అనుకుంటున్నాము. వెనకాల పక్కన ఉన్న గుడిసెలోని సిలిండర్లు పేలడంతో ప్రమాదం పెద్దదయింది" అన్నారు.



నుండి పక్కనున్న గుడిసెలకు కూడా వ్యాప్తి చెందాయి. సుమారుగా 400 గుడిసెలు తగలబడిపోయాయి. మొదటగా

# తిరుమలలో మరోసారి చిరుత కలకలం

**తిరుమల, ఏప్రిల్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఇటీవల తిరుమలలో చిరుతల సంచారం తీవ్రమైంది. రెండు వారాల క్రితమే అలిపిరి నుంచి కాలినడకన తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులను భయభ్రాంతులకు గురిచేసేలా చిరుత సంచరించిన వార్తలు వెలుగులోకి వచ్చాయి. దీంతో అలిపిరి నుంచి తిరుమలకు కాలినడకన వచ్చే శ్రీవారి భక్తులు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ క్రమంలో భక్తుల రక్షణ కోసం టీటీడీ అధికారులు తక్షణమే చర్యలు చేపట్టారు.

**భక్తుల రక్షణ కోసం టీటీడీ అధికారి చర్యలు**

భక్తుల భద్రతే మేము అధిక ప్రాధాన్యమిస్తామని టీటీడీ అధికారులు స్పష్టం చేశారు. గతంలో జరిగిన సంచార సంఘటనల నేపథ్యంలో తిరుపతి వేదిక్ విశ్వవిద్యాలయం వద్ద బోన్లు ఏర్పాటు చేసి, చిరుతను పట్టు పట్టే ప్రయత్నం జరిగింది. ఆనాటి ప్రయత్నంలో ఓ చిరుత బోనులో చిక్కిపోవడంతో ఆ సమయంలో భక్తులు, అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

**మరోసారి చిరుత సంచారం**

తాజాగా మరోసారి తిరుమల జూపార్క్ రోడ్ ప్రాంతం నుంచి తిరుమల టోల్ గేట్ వరకు చిరుత సంచరించినట్లు గుర్తించారు. అటవీ ప్రాంతంలోకి చిరుత దూసుకెళ్తుండటాన్ని గమనించిన సెక్యూరిటీ సిబ్బంది వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో మళ్లీ భక్తుల్లో భయం మళ్లె మరింత పెరిగింది. ఈ పరిణామాల నేపథ్యంలో చిరుతల పర్యవేక్షణ కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసేందుకు ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ సెల్‌ను తిరుమల అటవీ మ్యూజియం భవనంలోనే ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. ప్రత్యేకంగా శాటిలైట్ ట్రాకింగ్, అధునాతన కెమెరాలు, జీపీఎస్ ట్రాకింగ్ సిస్టమ్‌లు ఉపయోగించి చిరుతల గమనాన్ని నిరంతరం పర్యవేక్షించనున్నారు.







డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

తెలుగురాష్ట్రం దినపత్రిక

https://epaper.teluguraastram.com

ఆదివారం 27 ఏప్రిల్ 2025





**అమలాపురం, ఏప్రిల్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

స్థానిక కలెక్టరేట్లో జరిగిన మత్స్యకారుల సేవలో పథకం ప్రారంభోత్సవంలో పాల్గొన్న గౌరవ ఎమ్మెల్యే శ్రీ అయితా బత్తుల ఆనంద రావు గారు. అనంతరం లబ్ధిదారులకు చెక్కు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డా బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ రవిరాల మహేష్ కుమార్ గారు, ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల బుచ్చిరాజు సుబ్బరాజు గారు, ఆర్డీఓ మాధవి లత గారు మరియు తదితరులు పాల్గొన్నారు

# ఉగ్రవాదుల దాడికి ఉపాధ్యాయ సంఘాలు నిరసన




**మలికిపురం, ఏప్రిల్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

పహల్గాం దుర్ఘటనకు నిరసనగా మలికిపురం గాంధీ బొమ్మల సెంటర్ వద్ద సఖినేటిపల్లి మండలం,మలికిపురం మండలాలకు చెందిన ఉపాధ్యాయలు సంయుక్తంగా నిరసన కార్యక్రమం కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని ఇలాంటి ఘటనలు గట్టి చర్యలు తీసుకుని టూరిస్టులకు భద్రత కల్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య నాయకులు గుబ్బల శ్రీను,పిల్లి.హేమ సుందర్,నల్లి గోపి రాజు,కంకణాల చంద్ర శేఖర్,ఉండ్రు మోహన్ రావు పాల్గొన్నారు.

# కాలినడక దారిని ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోండి.

## లోక్ అదాలత్ లో సఖినేటిపల్లి మూడుతూముల వాసులు ఫిర్యాదు.



**రాజోలు, ఏప్రిల్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

కొన్ని దశాబ్దాలుగా ఉపయోగిస్తున్న కాలినడకదారిని ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకొని దారి సమస్యలనుండి విముక్తి కల్పించాలంటూ సఖినేటిపల్లి మండలం సఖినేటిపల్లి మూడుతూములు గ్రామానికి చెందిన కొందరు భాదితులు శనివారం రాజోలు కోర్టు కాంప్లెక్స్ నందు గల మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్,లోక్ అదాలత్ జడ్జి ప్రమీలా రాణి ని కలిసి ఫిర్యాదు చేశారు.వారియొక్క పూర్వీకులు పంట బోదెను దారిగా మలుచుకొని సుమారు 70 ఏళ్ళకు పూర్వం నుండి వినియోగించారని, ప్రస్తుతం 11 కుటుంబాలకు ఈ దారే తప్ప ఇతర మార్గం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.ఇరుకుగా ఉన్న ఈ కాలినడక మార్గాన్ని కందికట్ల ప్రభుదాసు అనే వ్యక్తి ప్రహరి గోడ నిర్మాణం కొరకు ఆక్రమిస్తుండుంగా,ఆయన మద్దత్తుదారుడు తాడి రాజబాబు అలియాస్ రాజు,వివాదంలో ఉన్నప్పటికీ స్థానికులపై అక్కసుతో నిర్మాణం చేస్తున్న తాపీ మేస్త్రీ కోనపల్లి శామ్యేలు పై ఫిర్యాదు చేశారు.సాదారణ నడక దారి మాత్రమే కాకుండా,పాఠశాలలకు వెళ్ళేందుకు విద్యార్థులకు,మహిళలు దైనందిన జీవితపు పనులు బట్టలు ఉతుకుట,మంచినీటి బిందెలు మ్రోయడం ఇరుకు సందులో ఇబ్బందికరంగా మారిందన్నారు.ఎవరైనా మరణించినట్లయితే ఈ దారి గుండనే శవపేటిక మ్రోయడం ఎంత ఇబ్బందో,బ్రతికి ఉన్న వర్ని ఎమెర్జెన్సీ టైం లో అంబులెన్స్ ఎక్కించాలన్నా అంతే ఇబ్బంది పడుతున్నామని కన్నీటి పర్యంతమయ్యారు.గొల్లమందల రాజేష్,ఇంజేటి రూప,గొల్లమందల జ్యోతి,సరోజిని,ఇంజేటి రజని,గెడ్డం భాను ప్రసాద్ పాల్గొన్నారు.

# మంచినీటి ట్యాంకును ప్రారంభించిన ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు



**అల్లవరం, ఏప్రిల్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

అల్లవరం మండలం బోడసకుర్రు హౌసింగ్ కాలనీలో నూతనంగా 57.19 లక్షలు రూపాయలతో నిర్మించిన నూతన ఓవర్ హెడ్ ట్యాంక్ ను శనివారం అమలాపురం శాసన సభ్యులు అయితాబత్తుల ఆనందరావు గ్రామ సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి తో కలిసి శనివారం ప్రారంభించారు.ప్రతి ఇంటింటికీ త్రాగు నీరు అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఓవర్ హెడ్ ట్యాంక్ ల నిర్మాణం చేపట్టిందని,ఎమ్మెల్యే ఆనందరావు అన్నారు. పలువురు గ్రామ సమస్యలను ఎమ్మెల్యే ఆనందరావు దృష్టికి తీసుకురాగా సానుకూలంగా స్పందించి త్వరలో అన్ని సమస్యలు పరిష్కారం చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ కార్పోరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబు రాజు, బి సి కార్పొరేషన్ డైరెక్టర్ కె వి, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు చింతా శ్రీను ,మండల తెలుగు యువత అధ్యక్షులు ముత్యాల బాబీ,జనసేన గ్రామ కమిటీ అధ్యక్షులు రోళ్ల శ్రీను ,అధికారి జయ వెంకటలక్ష్మి , జే ఈ స్వామి, అడపా వెంకటేశ్వరరావు , టీడీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు పచ్చిమాల ఏడుకొండలు ,రొక్కాల నాగేశ్వరరావు , , ఓలేటి పరమేష్,చింతం శ్రీను,కార్యదర్శి ఆదిశంకరం సచివాలయ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.





## తక్షణమే ఉపాధి హామీ

# వేతన బకాయిలు చెల్లించాలి

## వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్రఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు

**అల్లవరం, ఏప్రిల్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఉపాధి హామీలో వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్రఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాది హామీ పర్యటనలో భాగంగా శనివారం అల్లవరం మండలం కోడూరుపాడు గ్రామంలో ఉపాది కూలీలతో మాట్లాడటం జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సమ్మర్ అలవెన్స్ పునరుద్ధరించాలని అడిగిన వారందరికీ పని కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధిహామీ చట్టానికి ప్రమాదం ముంచుకొచ్చిందని, బిజెపి ప్రభుత్వం ఈ పథకానికి నిధులు తగ్గించిందన్నారు. ఇక నుండి కూలీలు రెండుపూటలు పని చేయాలని, వేసవి వేతనం (సమ్మర్ అలవెన్స్) రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. కూలీలు పని కోరి పోకపోతే ఆ పని దినాలు రద్దు చేస్తామని చెబుతుందని ప్రతివారం కొలతలు తీసేటప్పుడు టెక్నికల్ అసిస్టెంట్తో ధృవీకరణ పత్రం తీసుకోవాలని కొత్త కొత్త నిబంధనలు పెట్టిందని ఈ పనులు ఒత్తిడితో కూలీలే మాకొద్దు బాబోయ్ అనేలా కేంద్ర ప్రభుత్వం దుర్మార్గమైన కుట్రకు పాల్పడిందన్నారు. అనేక ఏళ్ళగా పోరాడి సాధించుకున్న చట్టమని ఎవరో మనకు పెట్టిన బిక్ష కాదని ఇది మన హక్కు కనుక ఈ చట్టాన్ని కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. 200 రోజులు పనులు 600 రూపాయలు వేతనం వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. టెంట్లు పని ప్రదేశంలో వేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు పి శివ విజయలక్ష్మి లక్షి కాంతం లక్ష్మి,అల్లవరం మండల కార్యదర్శి పొలమూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని

# పెంపొందించుకోవాలి

## ముగిసిన మూడు రోజుల అటల్ బూట్ సమ్మర్ క్యాంప్ ట్రైనింగ్

**అమలాపురం, ఏప్రిల్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



మారుతున్న కాలానికి అనుగుణంగా శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు పెంపొందించుకోవాలని సమగ్ర శిక్షా అకడమిక్ మానిటరింగ్ అధికారి పి.రాంబాబు పిలుపునిచ్చారు. అమలాపురం రూరల్ మండలం పేరూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మూడు రోజుల అటల్ బూట్ సమ్మర్ క్యాంప్ శనివారంతో ముగిసింది. పాఠశాల హెచ్ఎం కేఏఆర్ శ్రీనివాసరావు అధ్యక్షతన ముగింపు సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఏఎంవో రాంబాబు మాట్లాడుతూ మూడు రోజుల పాటు విద్యార్థులు పొందిన శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎలక్ట్రానిక్స్, గేమింగ్ ప్రోగ్రామ్, రోబోటిక్ టెక్నాలజీపై విద్యార్థులకు మూడు రోజుల పాటు పేరూరు అటల్ హబ్ పాఠశాలతో పాటుగా, పుల్లేటికుర్రు, అంబాజీపేట, గొల్లవిల్లి, జి.వేమవరం, అమలాపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల స్పోక్స్ స్కూల్స్ విద్యార్థులకు సమ్మర్ క్యాంప్ నిర్వహించారు. వచ్చే విద్యా సంవత్సరంలో జిల్లాలో ఉన్న 45 అటల్ స్కూల్స్ పాఠశాల ఉపాధ్యాయులకు ఒక రోజు వర్క్ షాపు నిర్వహించనున్నట్లు తెలిపారు. హెచ్ఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ మూడు రోజుల సమ్మర్ క్యాంప్ విద్యార్థులు సద్వినియోగం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన లైన్ ఫాలోయింగ్ రోబోటెక్ పోటీల్లో గొల్లవిల్లి జెడ్పీ పాఠశాల విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచారు. అనంతరం విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పార్టిసిపేటింగ్ సర్టిఫికేట్లు అందజేశారు. కార్యక్రమంలో ట్రైనర్లు పి.నరేష్, స్వాతిప్రియ, ఉపాధ్యాయులు బి.వి.గౌరీప్రసాద్, అటల్ హబ్ పాఠశాల నోడల్ ఇన్‌చార్జులు కె.పద్మావతి, కె.పావని, ఎం.సీతామహాలక్ష్మి, ఎ.రామకృష్ణ, యు.వి.రావు, డి.వి.నారాయణ, బీఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## రైతు ప్రయోజనాలే పరమావధిగా

# ధాన్యం కొనుగోలు

## దళారులను నమ్మి మోసపోవద్దు - - జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్






**అంబాజీపేట ఏప్రిల్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

జిల్లాలో రైతు సంక్షేమం, ప్రయోజనాలే లక్ష్యంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రారంభించి గిట్టుబాటు ధరలు అందించేందుకు అన్ని చర్యలు తీసుకన్నామని, దళారులను నమ్మి మోసపోవద్దని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ రైతులకు సూచించారు. శుక్రవారం అంబాజీపేట మండల పరిధిలోని మొసలపల్లి గ్రామంలో రైతులు విక్రయాల నిమిత్తం కల్లాల్లో ధాన్యం గోనె సంచుల్లో నింపుతున్న ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. గోనెసంచుల సరఫరాపై ఆరా తీసి, సంచుల్లో నింపిన ధాన్యం తేమ శాతం, నాణ్యత తరుగు శాతాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. హార్వెస్టింగ్ మిషన్ల ద్వారా నూర్పిళ్ళు జరిపిన పిదప పశు గ్రాస వరి గడ్డి సేకరణ విధానాలపై ఆరా తీశారు. ధాన్యం మిల్లులకు రవాణా, మిల్లర్లతో కొనుగోలుకు సంబంధించిన ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అన్న కోణంలో ఆరా తీశారు. ప్రభుత్వ పరంగా ధాన్య సేకరణ కోటా లక్ష్యాలను మెరుగుపరిస్తే రైతులకు మరింత ప్రయోజనం చేకూరుతుందని ధాన్యం సొమ్ములు ఎటువంటి జాప్యం లేకుండా రెండు రోజుల్లోనే జమ చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు జిల్లా కలెక్టర్ ని కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ, రెవెన్యూ, పౌరసరఫరాలు తదితర శాఖల భాగస్వామ్యంతో ధాన్యం సేకరణ కేంద్రాలు పనిచేస్తున్నాయని, ధాన్యం నమూనాలను కొనుగోలు కేంద్రాల వద్ద అందించి తదనుగుణంగా గిట్టుబాటు ధరలు పొందాలని సూచించారు. రైతుల కష్టం దళారుల పాలు కాకుండా ప్రభుత్వ యంత్రాంగం చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రస్తుత రబీ సీజన్లో ధాన్యం కొనుగోలుకు జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేసిందని అదే విధంగా బహిరంగ మార్కెట్లో కూడా గిట్టుబాటు ధరలు కల్పించేందుకు ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకున్నామని అన్నారు. రైతులు రైతు సేవా కేంద్రాల క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకుని గిట్టుబాటు ధరలు పొందాలన్నారు. రైతులకు ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రభుత్వం సులభతరం చేసిందన్నారు. రైతులు తమ ధాన్యాన్ని అమ్మడానికి వాట్సాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవచ్చన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో సమస్యలు ఎదురైతే జిల్లా కమాండ్ కంట్రోల్ రూమ్ కి ( ఫోన్ నెంబర్లు 83094 32487, 94416 92275 ) ఉదయం 8 గంటల నుంచి రాత్రి పది గంటల లోపు ఫోన్ చేసి పరిష్కరించుకోవచ్చునన్నారు.

# గొట్టుముక్కల రవికి వైట్ హౌస్ లో కీలక పదవి

**ఐ.పోలవరం ఏప్రిల్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



ఇండియాలో ఒక పల్లె వాసి అగ్రరాజ్యంలో అమెరికా సైబర్ సెక్యూరిటీ మౌలిక సదుపాయాల భద్రత సంస్థ ( సి ఐ ఎస్ ఏ ) డిప్యూటీ డైరెక్టర్ గా డాక్టర్ గొట్టుముక్కల రవి కీలక పదవిని సాధించడం పై తల్లిదండ్రులు, స్నేహితులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం కేశనకుర్రు గ్రామం గొట్టుముక్కల వెంకట సూర్యనారాయణ రాజు (కొండరాజు), సత్యవాణి దంపతుల కుమారుడు మధు. ఈ అరుదైన గౌరవం లభించడం పై అగ్రరాజ్యంలో మధు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తులు పండగ చేసుకుంటున్నారు. యువకులు కష్టపడితే పల్లె నుండి ప్రపంచంలోనే మేటి దేశాలలో కీలక పదవులు సాధించడం లో మధు ఒక ఉదాహరణ అని పలువురు అభిప్రాయపడ్డారు.

# సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే ఆనందరావుకు వినతిపత్రం అందించిన కమ్యూనిటీ హెల్త్ ఉద్యోగులు

**అల్లవరం, ఏప్రిల్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



వైద్య ఆరోగ్య శాఖ ఎన్ హెచ్ ఎమ్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ద్వారా ప్రజారోగ్య వ్యవస్థలో నాణ్యమైన సేవలు అందిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలను పరిస్కారం కొరతూ అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుకు వినతి పత్రాన్ని శనివారం అందజేశారు. 2019 నుండి గ్రామీణ ప్రాంతాల్లోని ఉప కేంద్రాల్లో బి ఎస్ సి నర్సింగ్ పట్టబద్రులను కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా నియమించారు, ఆ ప్రాంతాల్లోని ప్రజల ఆరోగ్య సంరక్షణ బాధ్యతలు నిర్వహిస్తూ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలతో 3 ప్రజారోగ్య వ్యవస్థను బలపరుస్తూ ఆరోగ్యఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్న మాకు గత 6 సంవత్సరాలుగా ఉద్యోగ భద్రత, ఆర్థిక భద్రత కూడా లేకుండా పోయింది, మా జీతాల విషయంలో తీవ్రమైన నిరాశలో ఉన్నాము, మా జీత భత్యాలు సకాలంలో చెల్లించకుండా దాదాపు 7 నెలల బకాయిలు పెట్టడం, క్లినిక్ అద్దె బకాయిలు, మా ఉద్యోగులను ప్రభుత్వం ద్వారా ఆదుకోవాలన్నారు. ముఖ్యంగా ఉద్యోగుల క్రమబద్దీకరణ అంశము, పని ఆధారిత ప్రోత్సహకాల క్రమబద్దీకరణ, ఎన్ హెచ్ ఎమ్ ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ మొదలగు సమస్యలను మా తరుపున ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి మా సమస్యల పరిస్కారం కొరకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాపాక సౌమ్య, నల్లి విజయకుమారి, పులుమాటి సుకాంత్, కోతూరి హరీష్ పాల్గొన్నారు.

## ఎప్పటి కప్పుడు మారుతున్న చట్టాలపైన న్యాయమూర్తులు

# నైపుణ్యం పెంచుకుని కేసులు త్వరితగతిన పరిష్కరించాలి

### హైకోర్టు న్యాయమూర్తులు డాక్టరు కె.మన్మధరావు, డాక్టరు వి.ఆర్.కె.కృపా సాగర్






**ఏలూరు ఏప్రిల్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
శనివారం జిల్లా కోర్టు సమావేశం మందిరంలో ఆంధ్రరాష్ట్ర ఉన్నత న్యాయస్థాన జడ్జి మరియు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిపాలన న్యాయమూర్తి డాక్టరు జస్టిస్ కె.మన్మధరావు,ఆంధ్రరాష్ట్ర ఉన్నత న్యాయస్థాన జస్టిస్ డాక్టరు వి.ఆర్.కె. కృపాసాగర్ లు ఈరోజు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని న్యాయమూర్తులకు ఒకరోజు వర్క్ షాప్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు మాట్లాడుతూ ఎప్పటికప్పుడు మారుతున్న చట్టాలపైన న్యాయమూర్తులు నైపుణ్యం పెంచుకోవాలని,ఈ వర్క్ షాప్ ద్వారా న్యాయమూర్తుల పనితీరు మెరుగుపరుచు కోవడానికి ఎంతగానో దోహద పడతాయన్నారు.కేసులు త్వరితగతిన విచారించి కేసులు పెండింగు లేకుండా చూడాలని హైకోర్టు న్యాయమూర్తులు కె.మన్మధ రావు,వి.ఆర్.కె.కృపాసాగర్ సూచించారు.
జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి ఎస్.శ్రీదేవి మాట్లాడుతూ 2025 వ సంవత్సరములు మొదటి వర్క్ షాప్ నిర్వహిస్తున్నామని, అనుభవజ్ఞులైన న్యాయమూర్తులు చేత ఇటువంటి శిక్షణ తరగతులు నిర్వహించడం జూనియర్ న్యాయమూర్తులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో విశ్రాంతి జిల్లా న్యాయమూర్తి వై.వి. రామకృష్ణ రిసోర్స్ పర్సన్, మొదటి అదనపు జిల్లా జడ్జి ఎం.రామకృష్ణంరాజు,ఇతర న్యాయమూర్తులు,తదితరులు పాల్గొన్నారు.

# వాడపల్లి దేవాలయానికి భక్తుల ప్రవాహం

### వేసవి సెలవుల ప్రభావం

### తెలుగు రాష్ట్రాల భక్తుల దర్శనం

### అంతా వెంకటేశ్వర స్వామి మహత్యం



**ఆత్రేయపురం ఏప్రిల్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
"ఏడు శని వారాల వెంకన్న దర్శనం.. ఏడేడు జన్మల పుణ్యఫలం" నినాదంతో కోనసీమ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన ఆత్రేయపురం మండలం వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడుతుంది. వందల సంఖ్యలో ప్రారంభమైన ఏడు శనివారాలు భక్తులు ఇప్పుడు వేల సంఖ్యలోకి చేరిపోయారు. తెలుగు రాష్ట్రాల నుంచి రైళ్లు, ఆర్టీసీ ప్రైవేటు బస్సులు, కార్లు,ఆటోలు,వ్యాన్‌లు, మోటార్ సైకిళ్ళు పై వేలాదిగా భక్తులు తరలివొస్తున్నారు. వీరే గాక స్థానికంగా నలభై ఏభై కిలోమీటర్ల నుంచి కూడా కాలినడకన స్వామివారి ఆలయానికి వచ్చి మొక్కలు తీర్చుకుంటున్నారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలకు వేసవి సెలవు ప్రకటించడంతో ఈ భక్తుల సంఖ్య మరింత పెరిగింది. గోదావరి ప్రవాహంలా వెంకన్న ఆలయానికి భక్తులు పోటెత్తుతున్నారు. గౌతమి గోదావరికి పశ్చిమ వైపున పచ్చని పంట పొలాల మధ్య ఈ స్వామి వారి ఆలయం కొలువుదీరి ఉంటుంది. కేరళ తరహాలో కోనసీమ అందాలు ఉంటాయి. ఆ కోనసీమ అందాలు చూడడానికి రెండు కళ్ళు చాలవంటే అతిశయోక్తి కాదు.అటువంటి అందాలరాశులు ఉండే ప్రాంతాలలో ఆత్రేయపురం మండలం ఒకటి. ఆకాశానికి ఎగిసిపడే కొబ్బరి చెట్లు.. పచ్చని తివాచీ పరిచినట్లుగా ఉండే వరి పొలాలు.. గలగల పారే పంట కాలువలు. ఈ ఆహ్లాదకరమైన అందాలను తిలకించడానికి దూర ప్రాంతాల నుంచి కూడా పర్యాటకులు తరలి వస్తుంటారు.అయితే అలాంటి పర్యాటక ప్రాంతంలో ఈ వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయం ఉండడం విశేషం. దేవాలయాలకు పర్యాటక రంగం తోడైతే ఇక ఆ క్షేత్రాలకు తిరిగే ఉండదు. ఎన్నిసార్లు వెళ్లినా మళ్లీ మళ్లీ వెళ్లాలనిపించే ప్రాంతాలవుతాయి. ఇప్పుడు వాడపల్లి దేవాలయం పరిస్థితి కూడా అదే.వారానికి ఒక రూపంలో ఈ వెంకటేశ్వర స్వామి భక్తులకు దర్శనమిస్తుంటారు.స్వామి వారి పూల,పండ్ల అలంకరణ ఈ ఆలయానికి ప్రత్యేకత. అందువల్లే ఈ స్వామివారిని ఎన్ని సార్లు చూసిన మళ్లీ మళ్లీ చూడాలనిపిస్తుంది.దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఆ స్వామి వారిని తనివితీరా చూసి భక్తితో పరవశించిపోతారు. అప్పటి వరకు ఎంతో కష్టపడి ఇక్కడకి చేరుకున్న వారంతా ఎక్కడా దొరకని ఆనందంతో ఏదో తెలియని అనుభూతిని పొందగలుగుతున్నారు. అందుకని ఎంత వ్యయప్రయాసలు పడినా ఇక్కడికి రాగలుగుతున్నారు..కాదుకాదు స్వామి వారు రప్పించుకోగలుగుతున్నారు. ఈ స్వామివారి అలంకరణే కాదు ఆలయ రూపు రేఖలు కూడా వారం మారు వారం మారిపోతున్నాయంటే అతిశయోక్తి కాదు. నెలా రెండు నెలల తర్వాత ఎవరైనా ఈ ఆలయానికి వెళితే ఊహించని మార్పులు కనిపిస్తున్నాయి. అంటే అంతగా ఆలయ అభివృద్ధి సాధిస్తుంది.గత దశాబ్దన్నర కాలంగా ఈ ఆలయానికి ఎక్కడలేని మహర్దశ కనిపిస్తుంది. భక్తుల సంఖ్య రోజురోజుకి పెరుగు పోతుండడంతో అందుకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించవలసి వస్తుంది.టిక్కెట్లు ధరలు పెంచినప్పటికీ ఏమాత్రం వెనకాడకుండా స్వామివారి దర్శనానికి భక్తులు పోటీపడుతున్నారు.ఈ శనివారం సాయంత్రం నాలుగు గంటలకు రూ. 1,116 వేదార్విచనం టిక్కెట్లు ద్వారా రూ.15,51,240 ఆదాయం రావడం ఇందుకు నిదర్శనంగా పేర్కోవచ్చు.అలాగే రూ 200 విశిష్ట దర్శనం టిక్కెట్లు ద్వారా రూ.12,73,200 రాగా రూ 50 లు ప్రత్యేక దర్శనం ద్వారా రూ.7,74,450 లు వచ్చాయి. హుండీ కాకుండా టిక్కెట్లు, ఆన్ లైన్ విరాళాలుగా సాయంత్రానికి రూ.49,60,411 ఆదాయం సమకూరింది.దీన్ని బట్టి ఆలయంకు వచ్చే భక్తులు తాకిడి ఎలా ఉంటుందో స్పష్టమవుతుంది. శనివారం వస్తుందంటే చాలు వాడపల్లి పరిసర ప్రాంతాలన్నీ తిరునాళ్ళను తలదన్నేలా కనువిందు చేస్తున్నాయి. కోనసీమ ముఖ ద్వారం రావులపాలెం మొదలుకొని వాడపల్లి.. ఆత్రేయపురం ఈ ప్రాంతాలన్నీ కూడా ఎక్కడలేని ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంటున్నాయి. గోవింద నామ స్మరణలతో మార్మోగిపోతున్నాయి. ఆలయం చుట్టూ ఏడు సార్లు ప్రదక్షిణం కూడా ఇక్కడ ఓ ప్రత్యేకత. భక్తులు రాకపోకలు వల్ల ప్రదక్షణకు ఆటంకం కలుగుతుందని ఫ్లై ఓవర్ ను కూడా నిర్మించారు. అలాగే వేసవిని దృష్టిలో ఉంచుకుని కూలర్లు,ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. వీటితోపాటు ఎక్కడికక్కడ కూలింగ్ వాటర్ ను భక్తులకు అందిస్తున్నారు. ఇందుకోసం ఆలయ ఉద్యోగులతో పాటు అనేక మంది మహిళలు సేవ చేయడానికి విచ్చేస్తున్నారు.ఇక్కడ భక్తులకు అందించే అన్నదానం కూడా విశేష ఆదరణ పొందింది. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో ఆలయ అభివృద్ధికి పెద్ద ఎత్తున ప్రభుత్వం నుంచి నిధులు సమకూరుస్తున్నారు. అలాగే ఈ ఆలయానికి వచ్చే భక్తులకు సౌకర్యాల కల్పనకు కూడా ఆయన ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, ఈవో నల్లం సూర్య చక్రధర్ లు ఆలయ అభివృద్ధికి, భక్తుల సౌకర్యాలు కల్పించడానికి కృషి చేస్తున్నారు. అన్నిటికంటే ముఖ్యంగా ప్రతి శనివారం ఇక్కడికి వచ్చే వాహనాలు వల్ల ట్రాఫిక్ అంతరాయం కలగకుండా కొత్తపేట డిఎస్పి సుంకర మురళీమోహన్ ఆధ్వర్యంలో రావులపాలెం రూరల్ సీఐ సిహెచ్ విద్యాసాగర్ గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.





# మహిళల ఆర్థిక పరిపుష్టికి కూటమి ప్రభుత్వం ప్రోత్సాహం

### -రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల



**కడియం, ఏప్రిల్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
ంంమహిళల ఆర్థిక పరిపుష్టికి ఉపాధి కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని, అనేక సంక్షేమ కార్యక్రమాలలో మహిళలకు పెద్దపీట వేస్తుందని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు.శనివారం కడియం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎం.పీ.పీ వెలుగుబంటి సత్యప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన కుట్టు మిషన్ (టైలరింగ్) కేంద్రాన్ని ఎమ్మెల్యే గోరంట్ల ప్రారంభించారు. ఆ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ మహిళలందరికీ వృత్తి నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చి, వారి ఉపాధి మెరుగుపరచడంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రతి మండలంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. కడియం మండలంలో 249 మంది లబ్ధిదారులను ఎంపిక చేశామని, వీరందరికీ 90 రోజులపాటు శిక్షణ ఇచ్చి శిక్షణ అనంతరం కుట్టు మిషన్ కూడా ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. ఒకప్పుడు మహిళలకు డ్వాక్రా గ్రూపులు ఏర్పాటు చేసి వారికి స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో పనిచేసిన నేత అన్న ఎన్టీఆర్ అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.. ఆ తరువాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు డ్వాక్రా గ్రూపులకు ఎంతో ప్రోత్సాహాన్ని అందించి మహిళలు స్వయం ఉపాధితో జీవించే విధంగా ఎన్నో కార్యచరణలు చేశారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కూడా మహిళ సంఘాల వారికి ఎంతో చేయూతనిస్తుందన్నారు.రూ.10 లక్షల వరకు బ్యాంకు రుణాలు అందించి వారి అభ్యున్నతికి ఎంతో దోహదపడుతుందని, మహిళలు సొంతంగా ఉపాధి పొందడంతో పాటు మరి కొంతమందికి ఉపాధి కల్పిస్తున్నారన్నారు. ఈ శిక్షణా కేంద్రం నందు ట్రైనింగ్ తీసుకుంటున్న వారందరూ వృత్తి నైపుణ్యాన్ని బాగా పెంపొందిచుకోవాలని, సొంతంగా ఉపాధి పొందే విధంగా శిక్షణ శిబిరాన్ని వినియోగించుకోవాలని సూచించారు. రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి మజ్జి పద్మావతి మాట్లాడుతూ ఇంటికి పరిమితమైన మహిళలను ఈరోజు సమాజంలో స్వయం ఉపాధి సంపాదించుకునే విధంగా మనకి అవకాశాన్ని కల్పించిన వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.రమేష్, మండల తెదేపా అధ్యక్షులు వెలుగుబంటి రఘురాం, వైస్ ఎంపీపీ పంతం గణపతి, మార్గాని సత్యనారాయణ, అన్నందేవుల చంటి, బోడపాటి గోపి, ముద్రగడ జమ్మి, ప్రత్తిపాటి రామారావు చౌదరి, చెల్లుబోయిన శ్రీనివాస్, పాఠంశెట్టి రాంజీ, చెక్కపల్లి మురళీకృష్ణ, ఏపీఎం నాగలక్ష్మి, బొరుసు సుబ్రహ్మణ్యం, కలిదిండి గోవిందు, ఆదిమూలం సాయిబాబా, వాసంశెట్టి నాగబాబు, సురపురెడ్డి జానకిరామయ్య, జల్లి కృపారావు, గుత్తుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా జడ్జిని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్.



**ఏలూరు ఏప్రిల్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
ఏలూరు జిల్లా నూతన ప్రధాన సివిల్ న్యాయమూర్తి (%ూతీఱఅఎఱజూఖశ్రీ ఱఊర్‌తీఱఫ్ జీబన్రస్త్రవ%) సిరిపురం శ్రీదేవిని శనివారం జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి నూతనంగా బాధ్యతలు చేపట్టిన జిల్లా జడ్జి సిరిపురం శ్రీదేవి కు పూలమొక్క అందజేశారు. అనంతరం వారు పలు అంశాలపై చర్చించారు.

## నియోజకవర్గ మంతటా ఇంటింటికి రక్షిత తాగునీరు

### రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల



**కడియం ఏప్రిల్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
ఎన్నడూ లేని విధంగా కోట్లాది రూపాయలతో రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలోని వాడ వాడల అభివృద్ధి జరుగుతుందని, అత్యధిక ప్రాధాన్యతగా మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతుందని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు.శనివారం కడియం మండలం జేగురుపాడు గ్రామంలో ఎస్సీ పేట నందు రూ. 49.90 లక్షలతో నూతనంగా నిర్మాణించిన వాటర్ ట్యాంక్ ప్రారంభోత్సవం అలాగే కడియపులంక గ్రామ శివారు దోసలమ్మ కాలనీ నందు రూ.47.10 లక్షలతో నిర్మించే వాటర్ ట్యాంక్, దుళ్ల గ్రామం ఎర్ర కాలనీ నందు రు. 49.90 లక్షలతో నూతనంగా నిర్మించే వాటర్ ట్యాంక్ లు స్థాపన కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గోరంట్ల , ఎం.పీ.పీ వెలుగుబంటి ప్రసాద్ తో కలిసి హాజరయ్యారు. ఆ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ గత ప్రభుత్వం జల జీవన్ పథకాన్ని నిర్వీర్యం చేసి నిధులన్నీ మళ్లించుకుపోయారని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేంద్ర ప్రభుత్వ సహకారంతో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అధిక ప్రాధాన్యతనిస్తున్నామన్నారు.అందులో భాగంగా జేగురుపాడు వాటర్ ట్యాంకు ప్రారంభించుకున్నామని, అలాగే దోసాలమ్మ కాలనీ, ఎర్ర కాలనీలలో వాటర్ ట్యాంకులు నిర్మించేందుకు శంకుస్థాపనలకు చేశామన్నారు. వేసవికాలం దృశ్యా మండలంలో త్రాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. రాబోయే రోజుల్లో గోదావరి నీటిని ఈ ట్యాంకుల ద్వారా ప్రతి ఇంటింటికి అందించే విధంగా ప్రణాళిక చేస్తున్నామని తెలిపారు. గ్రామాల అభివృద్ధి విషయంలో స్థానిక నాయకులు, ప్రజలు సహకరించాలని, అందరూ అభివృద్ధికి సహకరిస్తే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. అనంతరం దుళ్ల హై స్కూల్ నందు ఇటీవల వెలువడిన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో స్కూల్ మొదటి ర్యాంక్ సాధించిన పి.సాయిదుర్గ విద్యశ్రీ, రెండవ ర్యాంకు సాధించిన ఎన్.సత్య హారిక,అత్యధిక మార్కులు సాధించిన మరి కొంతమందిని సత్కరించి కొంత సొమ్మును వారికి ఆర్థిక ప్రోత్సాహంగా అందించారు. అలాగే గతంలో ఇచ్చిన హామీ మేరకు హై స్కూల్ నందు పిల్లలు ఆటలు ఆడుకునే విధంగా గ్రౌండ్ శుభ్రపరిచి ఆట స్థలాన్ని ఆటలకు అనువుగా ఏర్పాటు చేసేందుకు తన సొంత నిధులు లక్ష రూపాయలను హై స్కూల్ హెచ్‌ఎం,స్కూల్ కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే గోరంట్ల అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్, మండల తెదేపా అధ్యక్షులు వెలుగుబంటి రఘురాం, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, వైస్ ఎంపీపీ పంతం గణపతి, మార్గాని సత్యనారాయణ, బోడపాటి గోపి, గట్టి సుబ్బారావు, నాగిరెడ్డి రామకృష్ణ పాఠంశెట్టి రాంజీ, యాదల సతీష్ చంద్ర స్టాలిన్,కొండపల్లి పట్టియ్య, పాతూరి రాజేష్, మర్రెడ్డి రమేష్, ముద్రగడ జమ్మి, చెల్లుబోయిన శ్రీనివాస్, ముమ్మిడి దేవీ నాగేశ్వరరావు, గుర్రపు సత్యనారాయణ, బొరుసు సుబ్రహ్మణ్యం, మార్గాని ఏడుకొండలు, ఆదిమూలం సాయిబాబు, కొంబాబత్తుల సూర్య కుమార్, ఎర్రా సత్యనారాయణ, తూము శ్రీను, మెర్ల అయ్యప్ప, వాసంశెట్టి నాగబాబు, సత్తి వెంకటగిరి కంటిపూడి శ్రీను, చిలుకూరి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

### వానపల్లిలో ఇంట్లోనే

## అనధికార మద్యం విక్రయాలు

### రూ. 20 వేలు విలువైన అక్రమ మద్యం బాటిళ్లు స్వాధీనం



**కొత్తపేట ఏప్రిల్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం వానపల్లి గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన రూ. 20 వేల విలువైన మద్యం బాటిళ్ళను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కొత్తపేట పోలీసు స్టేషన్ వద్ద శనివారం రావులపాలెం రూరల్ సిఐ విద్యాసాగర్ ఈ వివరాలను వెల్లడించారు. వానపల్లి గ్రామంలోని రామ్మోహనరావు పేటలో కుంచే రమేష్ అనే వ్యక్తి ఇంట్లోనే మద్యం బాటిళ్లు నిల్వ చేసి విక్రయాలు చేస్తున్నారన్న సమాచారంతో శుక్రవారం రాత్రి ఎస్సై జి. సురేంద్ర సిబ్బందితో కలిసి దాడి చేసారు. ఆ సమయంలో నిందితుడు రమేష్ గోడ దూకి పారిపోగా, అతని ఇంట్లో ఉన్న 110 మద్యం బాటిళ్లు, రూ.6272 నగదుతో పాటు అతని మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నామని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సిఐ తెలిపారు. పరారైన నిందితుని కోసం గాలిస్తున్నామని చెప్పారు.

# శతాబ్ది ఉత్సవ సమారంభం

**ఘనంగా ఏయు శతాబ్ది సంవత్సర వేడుకలు ప్రారంభం**
**జయహొ ఏయు నినాదాలతో హొరెత్తిన సాగరతీరం**
**విశ్వానికే మణిహారం ఆంధ్ర విశ్వవిద్యాలయం**



విశాఖపట్నం, ఏప్రిల్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శనివారం ఉదయం సాగర తీరంలో కాళీమాత ఆలయం వద్ద నుంచి ఏయు కన్వెన్షన్ సెంటర్ వరకు వాకతాన్ కార్యక్రమం నిర్వహించారు. ఉపకులపతి ఆచార్య జి. పి రాజశేఖర్ ఏయూ అధికారులు, పూర్వ ఉపకులపతులతో కలసి ప్రారంభించారు.

విద్యార్థుల జయ జయ ద్వానాలతో.... జయహొ ఏయు నినాదాలతో... సాగర తీరం హొరెత్తింది. వందలాది మంది విద్యార్థులు, ఆచార్యులు, సిబ్బంది తరలిరాగా ఏయు కన్వెన్షన్ సెంటర్ వరకు ర్యాలీ కన్నుల పండుగగా సాగింది. ఆంధ్ర విశ్వవిద్యాలయ విశిష్టతను దాటే విధంగా విద్యార్థులు నినాదాలు ఇస్తూ, ప్లకార్డులు పట్టుకొని ర్యాలీలో ఉత్సాహంగా భాగస్వాములయ్యారు. అనంతరం ఏయు కన్వెన్షన్ సెంటర్ వద్ద విద్యార్థులను ఉద్దేశించి ఏయు ఉపకులపతి ఆచార్య జి.పి రాజశేఖర్ మాట్లాడుతూ ఎందరో మహనీయుల త్యాగాల ఫలితంగా విశ్వ కళామతల్లి ఆవిర్భవించిందని చెప్పారు. విశ్వ కళామతల్లి ప్రాంగణంలో శాస్త్ర సాంకేతిక రంగాలలో ముమ్ముందుకు వెళ్లే విధంగా నిరంతరం పనిచేయాలని పిలుపునిచ్చారు. దీనిని ప్రతిజ్ఞగా స్వీకరించి అవిశ్రాంతంగా ప్రయత్నాలు చేయాలని సూచించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం మరెంతో ప్రగతిని, అభ్యున్నతిని సాధించాలని ఆకాంక్షించారు. రాష్ట్రానికి, భారతదేశానికి పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చే దిశగా పనితీరు చూపుతూ, ప్రగతి సాధించాలని ఈ దిశగా సమిష్టిగా అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. శతాబ్ది సంవత్సరాన్ని పురస్కరించుకొని ఏడాది మొత్తం విభిన్న విద్య, సాంకేతిక, అవుట్ రీచ్ కార్యక్రమాలను నిర్వహిస్తామని ప్రకటించారు. వచ్చే సంవత్సరం ఇదే రోజున ఘనంగా శతాబ్ది ఉత్సవ వేడుకలను నిర్వహిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏయూ రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్ బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్ ధనుంజయ రావు, పూర్వ ఉపకులపతులు ఆచార్య వి బాల మోహన్ దాస్, బీలా సత్యనారాయణ, జి.ఎస్.ఎన్ రాజు, వి.ఎస్.ఆర్.కే ప్రసాద్, ఆర్.సుదర్శన రావు, రామకృష్ణారావు, ఏయు పూర్వ విద్యార్థుల సంఘం చైర్మన్ కె.వి.వి రావు, ఏయూ కళాశాలల ప్రిన్సిపాల్స్, పెద్ద సంఖ్యలో ఆచార్యులు, పరిశోధకులు విద్యార్థులు ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఆంధ్ర విశ్వవిద్యాలయం
# అంతర్జాతీయ ఖ్యాతి సాధించాలి

**అత్యుత్తమ బోధనా విధానాలను అమలు చేయండి**
**రాష్ట్రానికి విలువైన ఆభరణంగా ఏయూ నిలుస్తోంది**
**నగర పోలీస్ కమిషనర్ శంకబ్రతా బాగ్చి**





విశాఖపట్నం, ఏప్రిల్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

రాష్ట్రానికే తలమానికంగా ఆంధ్ర విశ్వవిద్యాలయం నిలుస్తుందని, ఇది అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి సాధించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రతా బాగ్చి అన్నారు. ఈరోజు ఉదయం ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిపాలనా భవనం వద్ద శతాబ్ది ఉత్సవాల ప్రారంభోత్సవ వేడుకలలో ఆయన పాల్గొన్నారు. వర్సిటీ వ్యవస్థాపక ఉపకులపతి కట్టమంచి రామలింగారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేశారు.

అనంతరం శతాబ్ది ఉత్సవాల లో భాగంగా ఏర్పాటుచేసిన ప్రత్యేక బెలూన్ ను ఎగురవేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా అనుసరిస్తున్న అత్యుత్తమ బోధనా విధానాలను ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అమలు చేయాలని సూచించారు. ఏయూ విద్యార్థులు సాధిస్తున్న ఉద్యోగ అవకాశాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. దేశంలోని అత్యుత్తమ విశ్వవిద్యాలయాలలో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఒకటిగా నిలుస్తోందని చెప్పారు. భవిష్యత్తులో అభివృద్ధి చెందిన దేశాల విద్యార్థులు ఆచార్యులు ఆంధ్ర విశ్వవిద్యాలయానికి వస్తారని ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం భవిష్యత్తులో మరిన్ని మైలురాళ్లను సాధించాలని అన్నారు. ఏ.యూ ఉప కులపతి ఆచార్య జి.పి రాజశేఖర్ మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయం ఘనమైన వారసత్వాన్ని కలిగి ఉందని, దీనిని మరింత ముందుకు

తీసుకువెళ్లడం జరుగుతుందని చెప్పారు. అంతర్జాతీయంగా ఏయూ ప్రగతిని ప్రస్ఫుటం చేసే విధంగా కార్యక్రమాలను చేపడతామని తెలిపారు. పోలీస్ కమిషనర్ అందించిన విలువైన సూచనలను విజన్ డాక్యుమెంట్ లో భాగం చేస్తామని చెప్పారు. విదేశీ విద్యార్థులను, ఆచార్యులను ఆంధ్ర విశ్వవిద్యాలయం స్వాగతిస్తుందని అన్నారు.

కార్యక్రమంలో భాగంగా ఏయు పరిపాలన భవనం, స్నాతకోత్సవ మందిరం, సిరిపురం కూడలి వద్దనున్న విశ్వవిద్యాలయ వ్యవస్థాపక ఉపకులపతి కట్టమంచి రామలింగారెడ్డి విగ్రహాలకు, మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలకు,, ఏపీ పాత్రో తో సహా పలువురు ప్రముఖుల విగ్రహాలకు పూలమాలలు వేశారు. ఏయూ మెయిన్ గేట్ వద్ద ఉన్న ఆంధ్ర విశ్వవిద్యాలయ చిహ్నం (లోగో) కి పూలమాల వేశారు. కార్యక్రమంలో ఏయూ రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్ బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్ ధనుంజయ రావు, ప్రిన్సిపాల్స్, ఆచార్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



**సోమవారం జివిఎంసి ప్రధాన కార్యాలయంలో మాత్రమే**
# ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు

**విశాఖ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో,**
**జీవీఎంసీ అన్ని జోనల్ కార్యాలయాలలో యధాతథంగా కార్యక్రమం**
**విశాఖ జిల్లా కలెక్టర్, జివిఎంసి ఇన్చార్జి కమిషనర్ ఎమ్ ఎన్. హరేంధిర ప్రసాద్**



విశాఖపట్నం, ఏప్రిల్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

విశాఖపట్నం, ఏప్రిల్ 26: మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ మేయర్ పదవికి 2025 ఏప్రిల్ 28వ తేదిన సోమవారం జివిఎంసి ప్రధాన కార్యాలయం లో ఎన్నిక జరుగనున్న నేపథ్యంలో పోలీసు వారు చేపట్టబోయే రక్షణ చర్యల కారణంగా , సోమవారం నిర్వహించవలసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జివిఎంసి ప్రధాన కార్యాలయం లో మాత్రమే రద్దు చేయడమైనదని, విశాఖ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో, జీవీఎంసీ అన్ని జోనల్ కార్యాలయాలలో సోమవారం అనగా ఏప్రిల్ 28వ తేదిన ఉ.గం.11.00 నుండి మధ్యాహ్నం 1.00 వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం యధాతథంగా నిర్వహించడం జరుగునని విశాఖ జిల్లా కలెక్టర్, జివిఎంసి ఇన్చార్జి కమిషనర్ ఎమ్ ఎన్.హరేంధిర ప్రసాద్ పత్రికా ప్రకటన ద్వారా శనివారం తెలిపారు.

కావున, నగరంలో పారిశుద్ధ్యం, పట్టణ ప్రణాళిక విభాగం, మొక్కల విభాగం, రెవిన్యూ, యు సి డి, ఇంజినీరింగ్ మొదలగు జీవీఎంసీ విభాగాలకు సంబంధించిన సమస్యలపై జీవీఎంసీ జోనల్ కార్యాలయాలలో, అలాగే కలెక్టర్ కార్యాలయంలో జరుగనున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో నగర ప్రజలు ఏప్రిల్ 28 వ తేదీ సోమవారం ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు అర్జీలు/వినతులు ద్వారా సమస్యలను తెలియపరుచుకోవచ్చునని నగర ప్రజలకు విశాఖ జిల్లా కలెక్టర్ ,జీవీఎంసీ ఇంచార్జ్ కమిషనర్ తెలియచేశారు.

# మలేరియాను అంతం చేద్దాం

**జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎన్.వి.నరేష్ కుమార్**




విశాఖపట్నం, ఏప్రిల్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

మలేరియా కు కారణమైన దోమల వృద్ధిని అరికట్టుటకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, మలేరియాను అందరం కలసి అంతం చేద్దామని జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎన్.వి.నరేష్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా జీవీఎంసీ మరియు జిల్లా మలేరియా సిబ్బంది, జోనల్ మలేరియా సిబ్బంది సంయుక్తంగా మలేరియా నిర్మూలనకై ప్రజల అవగాహన కొరకు జీవీఎంసీ గాంధీ విగ్రహం నుండి ర్యాలీని నిర్వహించారు.

ఈ సందర్భంగా జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి మాట్లాడుతూ వారానికి ఒక్కసారి ఫ్రైడే ఫ్రైడే ప్రజలు పాటించాలని, దోమలు వృద్ధి చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, పరిసరాలు పొడిగా ఉంచుకోవడంతో పాటు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమల నుండి రక్షణ కొరకు దోమతెరలు వాడాలని తెలిపారు. అనంతరం జిల్లా జోనల్ మలేరియా అసిస్టెంట్ డైరెక్టర్ కెవిఎస్ ప్రసాద్ రావు మాట్లాడుతూ దోమలు, దోమల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టాలంటే ప్రజల సహకారం అవసరమన్నారు. మంచినీటి నిలువలు లేకుండా చూసుకోవాలని, నీటి తొట్టెల పై మూతలు పెట్టాలని సూచించారు. జీవీఎంసీ నాలుగవ జోన్ సహాయ వైద్యాధికారి కృష్ణంరాజు మాట్లాడుతూ మలేరియా వ్యాధి లక్షణాలు సకాలంలో గుర్తించి తగిన చికిత్స తీసుకోవాలని తెలిపారు. తదుపరి జీవీఎంసీ బయాలజిస్ట్ డి సాంబమూర్తి మాట్లాడుతూ దోమలను నిర్మూలించే పద్ధతులను దోమకాటు ద్వారా వ్యాప్తి చెందే మలేరియా డెంగ్యూ మరియు చికెన్ గున్యా వ్యాధులపై అవగాహన ప్రజలకు ఈ ర్యాలీ ద్వారా కల్పించామని తెలిపారు.

ఈ ర్యాలీ కార్యక్రమంలో జీవీఎంసీ మరియు డిస్ట్రిక్ మలేరియా సిబ్బంది, జోనల్ మలేరియా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ధోనీ ఎప్పుడూ వేలంలో పాల్గొనలేదు: సురేశ్ రైనా

ఐపీఎల్ 2025 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ ప్లేఆఫ్స్‌కు వెళ్లడం దాదాపు కష్టమే. తొమ్మిది మ్యాచుల్లో కేవలం రెండే విజయాలు సాధించిన సీఎస్కే.. మిగిలిన ఐదు గెలిచినా నాకౌట్‌కు వెళ్తుందని చెప్పడం కష్టమే. అయితే, ఇతర జట్ల అవకాశాలు ఎలా ప్రభావితం చేస్తుందనేదే ఇక్కడ ఆసక్తికర అంశం. మెగా వేలం సందర్భంగా సరైన ఆటగాళ్లను ఎంపిక చేసుకోవడంలో సీఎస్కే వెనకబడిందని మాజీ క్రికెటర్ సురేశ్ రైనా వ్యాఖ్యానించాడు. ధోనీ () ఉన్నా.. మిగతా క్రికెటర్లు రాణిస్తేనే విజయం వరిస్తుందని పేర్కొన్నాడు. అయితే, ధోనీ ఎప్పుడూ వేలంలో పాల్గొనేవాడు కాదని గుర్తు చేశాడు.



### ధోనీకి అలా బంతులేస్తే బాదేస్తాడు: హర్షల్ పటేల్

"కాశీ సర్‌కు అడ్మినిస్ట్రేషన్‌కు 30ఏళ్లకుపైగా అనుభవం ఉంది. రూపా మేడమ్‌కు క్రికెట్ వ్యవహారాలు, ఆటగాళ్లను ఎలా కొనుగోలు చేయాలి, గ్రూప్‌ను ఎలా నిర్వహించాలనే విషయాలపై పట్టు ఉంది. అయితే, ఈసారి మాత్రం సరైన ఎంపికలు చేసినట్లు అనిపించలేదు. ఇది ప్రతిఒక్కరి భావన. ధోనీ ఉన్నా కూడా ఇలా ఎందుకు జరిగిందని కొందరు అడుగుతారు. నిజాయతీగా చెప్పాలంటే.. నేను ఎప్పుడూ వేలం ప్రక్రియకు హాజరుకాలేదు. అలాంటి చర్చల్లో భాగం కాలేదు. నేనెప్పుడైనా సరే రిటైన్ చేసుకున్న ప్లేయర్ల గురించే మాట్లాడేవాడిని. ధోనీ కూడా తన నిర్ణయం ఏంటో చెప్పేవాడు. అంతేకానీ, వేలంలో ఎప్పుడూ భాగం కాలేదు. కోర్ గ్రూప్‌లోని సభ్యులే ఆక్షన్‌లో పాల్గొంటారు. ధోనీ ఇలాంటి వేలానికి హాజరుకాడు. ఓ నలుగైదుగురు పేర్లను మాత్రమే సూచిస్తాడు. ఎవరిని రిటైన్ చేసుకోవాలో చెబుతాడు. 43 ఏళ్ల వయసులో అన్‌క్యాప్డ్ ప్లేయర్‌గా బరిలోకి దిగిన ధోనీ కష్టపడుతుంటే.. మిగతా పది మంది ఏం చేస్తున్నట్లు? అందులో కొందరికి రూ.18 కోట్లు, రూ.17 కోట్లు, రూ.12 కోట్లు దక్కాయి. మేనేజ్‌మెంట్ నమ్మి అవకాశం ఇచ్చినప్పుడు సద్వినియోగం చేసుకోవాలి. కానీ, ప్రతిసారీ అదే తప్పులతో విఫలం కావడం చూస్తున్నాం" అని రైనా వ్యాఖ్యానించాడు.

### ఇప్పటికీ మాది మంచి జట్టే: ఫ్లెమింగ్

"ఈ ఓటమిపై మాట్లాడటం కష్టంగా అనిపిస్తోంది. మా దగ్గరున్న అత్యుత్తమ క్రికెటర్లతో సరైన ప్రదర్శన చేసేందుకు ప్రయత్నించాం. మా స్టైల్ క్రికెట్ ఆడాం. ఆక్షన్‌లో మంచి జట్టును తయారుచేసుకోవడం కీలకం. ఈ విషయంలో మాకంటే ఇతర టీమ్‌లు కాస్త మెరుగ్గా ఉన్నాయి. టాప్ ఆర్డర్ నుంచి కింది వరుస వరకూ ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాలి. కీలక ఆటగాళ్లకు గాయాలు, కొందరు ఫామ్‌లో లేకపోవడం కూడా ప్రభావం చూపించింది" అని సీఎస్కే కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ వెల్లడించాడు.

### ఇక ట్రయల్ రన్‌లా..: రాయుడు

"ప్రస్తుత సీజన్‌లో సీఎస్కే పరిస్థితి బాగోలేదు. అథమంలో అథమంగా మారింది. అయితే, ఇక నుంచి నేర్చుకొనేందుకు చక్కటి అవకాశం వచ్చినట్లే. ఎంఎస్ ధోనీ కూడా వచ్చే ఎడిషన్ కోసం జట్టును తయారుచేసే పనిలో పడతాడు. ఇప్పుడు డెవాల్డ్ బ్రెవిస్, ఆయుష్ మాత్రే వంటి కుర్రాళ్లు వెలుగులోకి వచ్చారు. భవిష్యత్తు సీజన్లలో వారే కీలకంగా మారే అవకాశం లేకపోలేదు. వ్యక్తిత్వపరంగా మార్పులు చేయాల్సిన అవసరం ఉంది. ఇప్పుడంతా ట్రయల్‌రన్‌లా సీఎస్కే జట్టును చూడొచ్చు" అని అంబటిరాయుడు వ్యాఖ్యానించాడు.

# సన్‌రైజర్స్ 'ప్లేఆఫ్స్' ఛాన్స్‌లు..

## నితీశ్ మాటలు నిజం కావాలంటే?

సన్‌రైజర్స్ హైదరాబాద్ గతేడాది ఐపీఎల్ ఫైనలిస్ట్. ఈసారి ప్లేఆఫ్స్ బెర్తు కోసం ఆపసోపాలు పడుతోన్న టీమ్. ఆడిన తొమ్మిది మ్యాచుల్లో కేవలం మూడే విజయాలు. తాజాగా చెన్నైపై విజయం అనంతరం సన్‌రైజర్స్ ఆటగాడు నితీశ్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. 'గతేడాది ఆర్సీబీలా ఇప్పుడు మేం ఆడి ప్లేఆఫ్స్‌కు చేరతాం' అని అన్నప్పటికీ.. అదేమంత తేలికైన విషయం కాదు. ఐదింట్లో ఐదు గెలవాలంటే '100' శాతం కంటే అదనంగా శ్రమించాలి.



### గతేడాది ఆర్సీబీ చేసింది..
### ఆ స్ఫూర్తితో ఈసారి మేం సాధిస్తాం: నితీశ్

ఐపీఎల్ 18వ సీజన్ ప్లేఆఫ్స్ రేసు ఆసక్తికరంగా మారుతోంది. గుజరాత్ (12 పాయింట్లు), దిల్లీ (12), రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (12), ముంబయి ఇండియన్స్ (10) టాప్ -4లో కొనసాగుతున్నాయి. మూడు విజయాలు సాధించిన సన్‌రైజర్స్ హైదరాబాద్ (6) ఎనిమిదో స్థానంలో కొనసాగుతోంది. ఇలాంటి జట్టుకు ప్లే ఆఫ్స్ అవకాశాలు అతిస్వల్పం. మిగిలిన ఐదు మ్యాచులను ఎస్‌ఆర్‌హెచ్ గెలవాలి. అప్పుడు హైదరాబాద్ ఖాతాలో 16 పాయింట్లు అవుతాయి. ఇక్కడ విజయంతోపాటు మంచి రన్‌రేట్ సాధించాల్సి ఉంటుంది. ఎందుకంటే ప్రస్తుతం ఎస్‌ఆర్‌హెచ్ నెట్‌రన్‌రేట్ -1.103 చాలా తక్కువగా ఉంది. ఐదులో రెండు మ్యాచులను ఉప్పల్‌లో ఆడటం కలిసొచ్చే అంశం. అయితే, ఇక్కడ పిచ్‌లు విభిన్నంగా ఉంటాయని ఇప్పటికే రుజువైంది. బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండే పిచ్‌ను ఎంచుకుంటే సన్‌రైజర్స్‌కు తిరుగుండదు.

### ఎవరితో ఎప్పుడు?

**మే 2 :** గుజరాత్ టైటాన్స్‌తో అహ్మదాబాద్ వేదికగా హైదరాబాద్ తలపడనుంది. ఇది బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండే మైదానం. ఇప్పటి వరకు ఐపీఎల్‌లో ఇరు జట్లూ ఐదు సార్లు తలపడగా.. గుజరాత్ 3, హైదరాబాద్ ఒక్క మ్యాచ్‌లోనే గెలిచింది.

**మే 5:** ఉప్పల్ వేదికగా దిల్లీ క్యాపిటల్స్‌ను హైదరాబాద్ ఢీకొట్టనుంది. ఈ సీజన్ తొలి మ్యాచ్‌లో మినహా.. గత నాలుగింట్లోనూ సన్‌రైజర్స్ ఓటమిపాలైంది. బ్యాటింగ్‌కు అనుకూలంగా పిచ్‌ను ఎంపిక చేసుకోవాలి. ఐపీఎల్‌లో 25 మ్యాచుల్లో ఇరు జట్లూ తలపడగా.. హైదరాబాద్ 13 మ్యాచుల్లో గెలిచింది. దిల్లీ 12 మ్యాచుల్లో విజయం సాధించింది.

**మే 10:** కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టుతో ఉప్పల్‌లోనే హైదరాబాద్ తలపడనుంది. ఇరు జట్లూ ఐపీఎల్‌లో 29 మ్యాచుల్లో ఢీకొన్నాయి. ఇందులో కోల్‌కతా 20 మ్యాచుల్లో గెలవగా.. హైదరాబాద్ కేవలం తొమ్మిదింట్లో విజయం సాధించింది.

**మే 13:** చిన్నస్వామి స్టేడియం వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును సన్‌రైజర్స్ ఢీకొట్టనుంది. పిచ్ ఎలా స్పందిస్తుందో ఎవరూ చెప్పలేని పరిస్థితి. ఇక్కడ మ్యాచుల ఫలితాలు అలానే ఉన్నాయి. ఒక్కోసారి బ్యాటింగ్‌కు, మరొకసారి బౌలింగ్‌కు సహకరిస్తోంది. ఐపీఎల్‌లో ఇరు జట్లూ 25 సార్లు తలపడగా.. హైదరాబాద్ (13)దే ఆధిక్యం. బెంగళూరు 11 మ్యాచుల్లో గెలిచింది.

**మే 18:** లీగ్‌స్టేజ్‌లో ఇది చివరి మ్యాచ్. ఏకనా స్టేడియం వేదికగా లఖ్‌నవూ-హైదరాబాద్ మ్యాచ్ జరగనుంది. ఇది బౌలింగ్‌కు అనుకూలంగా ఉండే పిచ్. ఇక్కడ కనీసం 175 పరుగులు చేస్తే విజయం సాధించేందుకు అవకాశాలు మెండు. ఇప్పటి వరకు ఐపీఎల్‌లో ఇరు జట్లూ ఐదు మ్యాచుల్లో తలపడ్డాయి. ఇందులో లఖ్‌నవూ 4, హైదరాబాద్ కేవలం ఒక్క మ్యాచ్‌లోనే గెలిచింది.

# వారికంటే ఐపీఎల్‌లో అన్‌క్యాప్డ్ ప్లేయర్ భత్యమే ఎక్కువ: సునీల్ గావస్కర్

భారత జట్టుకు ఎంపిక కావాలంటే ఇప్పుడు సులువైన మార్గం ఐపీఎల్. ఒకప్పుడు దేశవాళీ క్రికెట్‌లో మంచి ఆటతీరు కనబరిస్తే రక్కున అవకాశాలు వచ్చేవి. ఇప్పుడైతే ఐపీఎల్‌లో నిలకడగా ఆడుతున్నాడా? లేదా? అనేది మేనేజ్‌మెంట్ చూస్తుందనడంలో సందేహం లేదు. అలాగని రంజీల్లో ఆడేవారికి విలువ లేదా? అంటే ఉంది కానీ ఐపీఎల్‌తో పోలిస్తే అవకాశాలపరంగానే కాకుండా జీతభత్యాల్లోనూ వ్యత్యాసం ఉందనేది మాజీ క్రికెటర్ల అభిప్రాయం. ఈ అంశంపై క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ తన విశ్లేషణను వెల్లడించాడు.



పాక్‌తో క్రికెట్ సంబంధాలన్నింటినీ
తెంచుకోవాలి: సౌరభ్ గంగూలీ

"పెద్దగా పరిచయం లేని క్రికెటర్ కూడా ఐపీఎల్‌లో ఒక్క మంచి ఇన్నింగ్స్ ఆడినా చాలు గొప్ప గౌరవం అందుకొంటాడు. అదే జాతీయ ఛాంపియన్‌షిప్ రంజీ ట్రోఫీలో ఎంత రాణించినా కనీసం హెడ్‌లైన్స్‌లోనూ కనిపించడు. ఐపీఎల్‌లో అలా కాదు. ఇప్పటికే ఎన్నో సందర్భాలను మనం చూశాం. సీజన్‌లో ఒకటి లేదా రెండు మ్యాచుల్లో దూకుడుగా ఆడితే అతడి పేరు మారుమోగిపోతుంది. కెరీర్ మొత్తం రంజీ ట్రోఫీ ఆడినా అది సాధ్యం కాదు. ఐపీఎల్‌కున్న భారీ ఆదరణే దీనికి కారణం. బ్రాడ్‌కాస్ట్‌పరంగానూ స్పాన్సర్‌షిప్ హక్కులు రూ.కోట్లలో ఉంటాయి. ఐపీఎల్ కంటే ఎక్కువగా దేశవాళీలో ఆడే వారికి ఇది పెద్దగా రుచించని వాస్తవం. రంజీ ట్రోఫీ, విజయ్ హజారే, సయ్యద్ ముస్తాక్ అలీ సీజన్‌లు అన్నీ కలిపి ఆడినా.. ఐపీఎల్‌లో అన్‌క్యాప్డ్ ప్లేయర్‌కు వచ్చే కనీస మొత్తం రూ.30 లక్షలకు దరిదాపుల్లో ఉండదు. ఈ అసమానతను తగ్గించాల్సిన అవసరం బీసీసీఐతోపాటు అన్ని రాష్ట్రాల క్రికెట్ బోర్డులపై ఉంది. ఇప్పటికే ముంబయి తమ రంజీ ప్లేయర్లకు బీసీసీఐతో సమానంగా చెల్లింపులు చేస్తోంది" అని గావస్కర్ వెల్లడించాడు. ప్రస్తుతం స్టార్లుగా మారిన బుమ్రా, హార్దిక్, సిరాజ్, యశస్వి, కేఎల్ రాహుల్, చాహల్.. ఇలా చాలామంది జాతీయజట్టుకు ఎంపికైనవారే. తాజాగా 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ రాజస్థాన్‌కు ప్రాతినిధ్యం వహిస్తూ రూ.1.1 కోట్ల ప్యాకేజీని సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే.

# పాక్‌తో క్రికెట్ సంబంధాలన్నింటినీ తెంచుకోవాలి: సౌరభ్ గంగూలీ

2008 తర్వాత పాకిస్థాన్‌కు టీమ్‌ఇండియా వెళ్లని సంగతి తెలిసిందే. చివరిసారిగా 2012 - 13లో భారత్ వేదికగా ఇరు జట్ల మధ్య ద్వైపాక్షిక సిరీస్ జరిగింది. అప్పట్నుంచి కేవలం తటస్థ వేదికల్లోనే తలపడుతూ వస్తున్నాయి. ఇప్పుడు పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్‌తో క్రికెట్ ఆడొద్దనే డిమాండ్లు వస్తున్నాయి. ఈ వ్యాఖ్యలకు భారత మాజీ క్రికెటర్ సౌరభ్ గంగూలీ మద్దతు తెలిపాడు. ఇక నుంచి పాక్‌తో ఎలాంటి క్రికెట్ ఆడొద్దని బీసీసీఐకి విజ్ఞప్తి చేశాడు.



"వందశాతం అంగీకరిస్తా. పాకిస్థాన్‌తో క్రికెట్ సంబంధాలను తెంచుకోవాలి. అది జరిగి తీరాలి. తప్పకుండా కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రతి సంవత్సరం ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉండటం తమాషా కాదు. ఉగ్రవాదాన్ని ఏమాత్రం సహించకూడదు" అని గంగూలీ వ్యాఖ్యానించాడు.

### ఉగ్రదాడిపై స్పందించని పాక్ క్రికెటర్లు

కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిపై ప్రపంచవ్యాప్తంగా స్పందనలు వస్తుంటే.. డానిష్ కనేరియా మినహా పాకిస్థాన్ క్రికెటర్లు ఎవరూ స్పందించలేదు. గత ఛాంపియన్స్ ట్రోఫీ సందర్భంగా మాత్రం భారత్‌పై అవాకులు చవాకులు పేలిన సంగతి తెలిసిందే. టోర్నీనే బహిష్కరించాలంటూ పెద్ద మాటలే చెప్పారు. ఇప్పుడు మాత్రం కనీసం ఖండిస్తూ ఒక్క ప్రకటన చేయలేదు. ఆ దేశ ప్రభుత్వంలా 'తమకేమీ సంబంధం' లేనట్లుగా వ్యవహరిస్తుండటం గమనార్హం.

# తేడాది ఆర్సీబీ చేసింది.. ఆ స్ఫూర్తితో ఈసారి మేం సాధిస్తాం: నితీశ్

ఐపీఎల్ 2025 సీజన్‌లో చెపాక్ వేదికగా తొలిసారి సన్‌రైజర్స్ హైదరాబాద్ అద్భుత విజయం సాధించింది. చెన్నై సూపర్ కింగ్స్‌ను ఐదు వికెట్ల తేడాతో మట్టికరిపించింది. దీంతో ప్లేఆఫ్స్ అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. తొమ్మిది మ్యాచుల్లో మూడు విజయాలనే నమోదు చేసిన సన్‌రైజర్స్.. మిగతా ఐదు మ్యాచుల్లో అన్నీ గెలిస్తేనే నాకౌట్‌కు చేరుతుంది. ఈ విషయంలో తమకు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టే స్ఫూర్తి అని ఎస్‌ఆర్‌హెచ్ ఆటగాడు నితీశ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించాడు.



"చెన్నైపై విజయం సాధించడం ఆనందంగా ఉంది. ఇకనుంచి మేం ఒక్కో మ్యాచ్ ఫలితం గురించి ఆలోచిస్తాం. ఇప్పుడు గెలిచాం. మిగిలిన వాటిల్లోనూ విజయం సాధించేందుకు ప్రయత్నిస్తాం. కమిందుతో కలిసి కీలక భాగస్వామ్యం నిర్మించడం బాగుంది. భారీ షాట్లకు పోకుండా తేలికగా మ్యాచ్‌ను ముగించాలని మాట్లాడుకున్నాం. నూర్ అహ్మద్, ఖలీల్ అహ్మద్ బౌలింగ్ బాగా చేస్తున్నారు. చివరికి మేం విజయం సాధించాం. మాకు డూ ఆర్ డై లాంటి పోరు. గతేడాది ఇదే పరిస్థితుల్లో ఆర్సీబీ ఉంది. వరుసగా మ్యాచులు గెలిచి ప్లే ఆఫ్స్‌కు చేరుకుంది. ఈ సంవత్సరం మేం ఎందుకు సాధించకూడదు? వందశాతం ప్రదర్శన ఇస్తే మిగతా మ్యాచుల్లో విజయం సాధించే అవకాశాలు మెరుగ్గా ఉంటాయి" అని నితీశ్ వెల్లడించాడు.

# 'రెండు రకాల జీవితాలు చూశాను': శ్రుతిహాసన్



ముంబయి : " రెండు రకాల జీవితాలు చూశాను " అని ప్రముఖ సినీనటుడు కమల్ హాసన్ కుమార్తె, హీరోయిన్ శ్రుతిహాసన్ అన్నారు. సినీ నేపథ్యం ఉన్న కుటుంబం నుండి ఆమె వచ్చినప్పటికీ తాను ఎప్పుడూ ఆ విషయాన్ని తన దృష్టిలో పెట్టుకోలేదని తాజాగా ఆమె వెల్లడించారు. వెండితెరపై తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును తెచ్చుకున్నారు. అయితే తాజాగా ఓ ఇంటర్వ్యూలో శ్రుతిహాసన్ మాట్లాడుతూ ఏమన్నారంటే %ొ% " నేను ఇండిస్ట్రీకి రావడానికి ముందు నా జీవితంలో ఏం జరిగిందో చాలామందికి తెలియదు. నా తల్లిదండ్రులు విడిపోవడం నన్ను ఎంతో బాధించింది. వారిద్దరూ విడిపోయాక నేను అమ్మతో ఉన్నాను. అప్పటివరకు ఉన్న జీవితం ఒక్కసారిగా మారిపోయింది. చెన్నై నుంచి ముంబయి వచ్చేశాం. విలాసవంతమైన జీవితం దూరమైంది. అప్పటివరకూ మెర్సిడెస్ బెంజ్ కారులో తిరిగిన నేను లోకల్ ట్రైన్‌లో ప్రయాణించాను. రెండు రకాల జీవితాలు చూశాను. ఇండిస్ట్రీకి వచ్చాక నాన్నతో ఎక్కువగా ఉంటున్నాను. విదేశాల్లో సంగీతం నేర్చుకున్నాను. నాకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాను. స్వతంత్రంగా, ఆత్మవిశ్వాసంతో జీవిస్తున్నాను " అని చెప్పారు. శ్రుతిహాసన్ తల్లిదండ్రులు కమల్ హాసన్, సారిక 2004లో విడిపోయిన సంగతి విదితమే.

# దసరాకే 'అఖండ 2' విడుదల

నందమూరి బాలకృష్ణ, ప్రగ్యా జైశ్వాల్ ప్రధాన పాత్రల్లో నటించిన 'అఖండ' సినిమాకు సీక్వెల్‌గా తెరకెక్కు తున్న సినిమా 'అఖండ 2: తాండవం'. ఈ సినిమా షఉటింగ్ రెగ్యులర్‌గా కొనసాగుతోంది. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన సింహా, లెజెండ్, అఖండ చిత్రాలు మంచి హిట్ మూవీస్‌గా నిలిచాయి. ఈ సినిమా విడుదల కూడా ఆలస్యమవుతుందని సోషల్ మీడియాలో ఊహాగానాలు వచ్చాయి. 'అఖండ'కు సీక్వెల్‌గా వస్తున్న 'అఖండ 2 : తాండవం' సినిమాను దసరా కానుకగా సెప్టెంబర్ 25న విడుదల చేయబోయబోతున్నట్లుగా మేకర్లు ప్రకటించారు. దర్శకుడు బోయపాటి శ్రీను పుట్టినరోజైన శు క్రవారంనాడు మేకర్లు శుభాకాంక్షలు తెలియజేయటంతోపాటుగా అఖండ 2 సినిమాను సెప్టెంబర్ 25న విడుదల చేయ బోతున్నట్లుగా విడుదల చేసిన పోస్టర్‌లో పేర్కొన్నారు. ఈ పోస్టర్‌ను చూసిన కొందరు ఇంకా షఉటింగ్ పూర్తికాలేదు. ఐదు నెలలే సమయం ఉంది. వీఎఫ్ఎక్స్ వర్క్ పూర్తవుతుందా? అంటూ పోస్టులు పెడుతున్నారు. అఖండ 2 సంక్రాంతికి విడుదలవుతుందంటూ కూడా పేర్కొంటున్నారు. 2023లో వీర సింహారెడ్డి, 2025లో డాకు మహారాజ్‌తో సంక్రాంతికి వచ్చి హిట్లు కొట్టారు. 14 రీల్స్ నిర్మాణ సంస్థ కూడా బోయపాటికి ఎక్స్ ఖాతా ద్వారా శుభాకాంక్షలు తెలిపింది.







# 'కలియుగం-2064' ట్రైలర్ విడుదల

శ్రద్ధా శ్రీనాథ్, కిశోర్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కలియుగం-2064'. ప్రమోద్ సుందర్ దర్శకత్వం వహించారు. తమిళ, తెలుగు భాషల్లో తెరకెక్కిన ఈ సినిమా మే 9న విడుదల కానుంది. ఆర్కే ఇంటర్నేషనల్, ప్రైమ్ సినిమా బ్యానర్లపై కెఎస్ రామకృష్ణ, కె.రామ్‌చరణ్ నిర్మించారు. తెలుగులో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఈ సినిమాను విడుదల చేస్తున్నారు. ట్రైలర్‌లో చూస్తే రాబోయేకాలంలో 2064లో మనుషులు ఎలా ఉంటారనే కాన్సెప్ట్‌తో ఈ సినిమాను తెరకెక్కించినట్లుగా తెలుస్తోంది. భయంతో, ఆకలితో చద్దామా..లేదంటే పోరాడి చద్దామా? అనేది మన చేతుల్లో ఉంది అనే డైలాగ్ వినిపించింది. ఈ సినిమాకు డాన్ విన్సెంట్ సంగీతాన్ని అందించారు

# 'కొరగజ్జ' కోసం కొత్త ప్రయోగం చేశా : గోపీ సుందర్

'కొరగజ్జ' చిత్రానికి సంగీతం కంపోజ్ చేయడానికి ఎంతో రీసెర్చ్ చేయాల్సివచ్చింది. సంగీతంలో కొత్త ప్రయోగాల్ని చేయాల్సి వచ్చింది. అందుకే కాస్త ఎక్కువ సమయం పట్టింది. గత చరిత్రను తెలుసుకోవాల్సివచ్చింది. అందుకే కాస్త ఎక్కువ సమయం పట్టింది. నాటి ఆచారాలు, సంప్రదాయాల్ని అర్థం చేసుకున్న తర్వాత నాకు ఈ ట్యూన్స్ వచ్చాయి. దర్శకుడికి నా పని నచ్చినందుకు, నేను ఇచ్చిన మ్యూజిక్‌ను ఇష్ట పడినందుకు సంతోషంగా ఉంది. ఈ సినిమా ద్వారా కొత్త సంగీతాన్ని అన్వేషించడానికి, కొత్త శైలిని కనిపెట్టడానికి నాకు వీలు కల్పించింది. ఈ చిత్రం నాకు ఎంతో సవాల్‌గా అనిపించింది' అని ప్రముఖ సంగీత దర్శకుడు గోపీ సుందర్ అన్నారు. త్రివిక్రమ సినిమాస్, సక్సెట ఫిల్మ్స్ బ్యానర్‌పై సుధీర్ అత్తవర్ దర్శకత్వం వహించిన చిత్రం 'కొరగజ్జ'. కర్నాటక, కేరళలోని కరావలి (తులునాడు) ప్రాంతంలో, ముంబైలోని కొన్ని ప్రదేశాల్లో పూజించబడే ప్రధాన దేవత కొరగజ్జ చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఈ చిత్రానికి గోపీ సుందర్ సంగీతాన్ని అందించారు. సాహిత్యం సుధీర్ అత్తవర్. శ్రేయ ఘోషల్, సునిధి చౌహాన్, శంకర్ మహదేవన్, జావేద్ ఆలీ, స్వరూప్‌ఖాన్, అర్మాన్ మాలిక్ వంటి ప్రతిభావంతులైన గాయకులు పాడారు. కబీర్‌బేడి, సందీప్ సోపార్కర్, గణేష్ ఆచార్య, భవ్య, శ్రుతి వంటివారు నటించారు. మనోజ్ పిళ్లై సినిమాటోగ్రఫీ అందించారు.







# 'రక్తకన్నీరు' నాగభూషణం పుస్కకావిష్కరణ

హైదరాబాద్ బ్యూరో : ఎన్నో పాత్రలకు తన నటనతో ప్రాణం పోసిన విలక్షణ నటుడు నాగభూషణం జీవితంలోని వివిధ విశేషాలు, సినీ ప్రయాణానికి సంబంధించిన విషయాలను తెలియజేస్తూ సీనియర్ జర్నలిస్ట్ ఉదయగిరి ఫయాజ్ 'రక్తకన్నీరు' నాగభూషణం అనే పుస్తకాన్ని రచించారు. ఈ పుస్తకావిష్కరణ వెర్సటైల్ యాక్టర్.. నటకిరిటీ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ చేతుల మీదుగా ఆయన స్వగఅహంలో జరిగింది. ఈ కార్యక్రమంలో పుస్తక రచయిత ఫయాజ్, నాగభూషణం గారి పెద్ద కుమారుడు రాఘవరావు, పెద్ద కుమార్తె మల్లీశ్వరి, అల్లుడు అరుణ్ కుమార్, రాహిల్ తాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా %ొ% నటకిరిటీ డా.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ %ొ%. " నా జీవితంలో ఈరోజు ఎంతో అదఅష్టమైన రోజు. ఎందుకంటే, విశ్వవిఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారక రామారావుగారి ఇంట్లో పుట్టే అదఅష్టాన్ని ఆ దేవుడు నాకు ప్రసాదించాడు. ఆయనతోపాటు మహామహులను కలుసుకునే అవకాశం కలిగింది. అందులో అతి ముఖ్యమైన వ్యక్తి నాగభూషణంగారు. 'రక్తకన్నీరు' నాగభూషణంగారికి నాకు దగ్గరి పోలిక ఏంటంటే, నేను కామెడీని హీరోయిజం చేస్తే, ఆయన విలనిజంలోనూ కామెడీ చేశారు. మరీ ముఖ్యంగా ఆయనకు డబ్బింగ్‌లో చాలా గొప్ప పేరుంది. ఆయన షఉటింగ్‌లో ఏ టైమింగ్‌లో అయితే డైలాగ్ చెబుతారో అదే టైమింగ్‌తో డబ్బింగ్‌ను కళ్లు మూసుకుని మరీ చెప్పగలరు. ఇఆయన స్టేజ్ నుంచి వచ్చిన గొప్ప నటులు. సినిమాల్లో నటించే రోజుల్లోనూ ఆయన స్టేజ్ షోలను విడిచి పెట్టలేదు. ఆయన గురించి చెప్పుకుంటూ వెళితే ఎన్నో విశేషాలు చెప్పొచ్చు. అలాంటి విషయాలను సీనియర్ జర్నలిస్ట్ ఫయాజ్‌గారు పుస్తక రూపంలోకి తీసుకొచ్చారు. సీనియర్ నటులు గురించి నేటితరం వాళ్లకి ఎలా తెలుస్తుంది.. ఇలాంటి పుస్తకాల ద్వారానే. కాబట్టి ఫయాజ్‌గారికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఇవాళ 'రక్తకన్నీరు' నాగభూషణం పుస్తకాన్ని వాళ్ల కుటుంబ సభ్యుల సమక్షంలో ఆవిష్కరించే అవకాశం రావటం అనేది నా అదఅష్టంగా భావిస్తున్నాను. అందరూ ఈ పుస్తకాన్ని చదవాలని కోరుకుంటున్నాను " అన్నారు. రైటర్ 'ఉదయగిరి' ఫయాజ్ మాట్లాడుతూ "నాగభూషణంగారు గొప్ప నటులే కాదు.. అంతకు మించిన సంస్కారి. తన జీవితాన్ని అతి సామాన్యంగా గడిపిన వ్యక్తి. ఆయన జీవితంలో ఏ కోణాన్ని తీసుకున్నా మనకు గొప్పగా కనిపిస్తుంది. ఆయన ఎంత గొప్ప నటుడో అంతకు మించిన గొప్ప వ్యక్తిత్వం ఉన్న మనిషి నాగభూషణంగారు. ఆయన గురించి పుస్తకం రాసే అవకాశం కలగటం నా అదఅష్టం. దాన్ని నాకెంతో ఆప్తుడైన రాజేంద్రప్రసాద్ చేతుల మీదుగా ఆవిష్కరించటం మరింత ఆనందాన్ని కలిగిస్తుంది. ఈ పుస్తక రచనలో ఆయన కుటుంబ సభ్యులు ఎంతగానో సహకరించారు. ఈ సందర్భంగా వారికి నా హఅదయపూర్వకమైన ధన్యవాదాలను తెలియజేస్తున్నాను" అన్నారు.

# ఎన్టీఆర్ - నీల్ సినిమాలో ఛాన్స్ కొట్టేసిన మమిత బైజు!





మలయాళ హీరోయిన్ 'మమిత బైజు' గురించి తెలుగు ప్రేక్షకులకు కొత్తగా పరిచయం అక్కర్లేదు. గత కొంతకాలంగా మలయాళం సినిమాలు తెలుగు బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకుంటున్నాయి. ఈ క్రమంలోనే నస్లీన్, మమితా కలిసి నటించిన "ప్రేమలు" చిత్రం యూత్ కి బాగా కనెక్ట్ అయ్యి మంచి హిట్ కొట్టింది. దీంతో చేసింది ఒక్క సినిమానే అయిన ఓవర్ నైట్ లో స్టార్ హీరోయిన్ గా మారిపోయింది ఈ భామ. అయితే ఈ హీరోయిన్ గురించి ఇప్పుడు ఓ వార్త సినీ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. యంగ్ టైగర్ ఎన్టీఆర్ ప్రస్తుతం ఫుల్ జోష్ లో దూసుకుపోతున్నారు. గత ఏడాది ఎన్టీఆర్ 'దేవర' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చి భారీ హిట్ తన ఖాతాలో వేసుకున్నారు. ప్రస్తుతం ఎన్టీఆర్ %-% ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో సినిమా తెరకెక్కుతుంది. మైత్రి మూవీ మేకర్స్ భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్న ఈ సినిమాను 2026 చివర్లో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తోంది. గత ఏడాదిలో సినిమా పూజా కార్యక్రమాలు జరగగా గత నెలలోనే సినిమా షఉటింగ్ ప్రారంభించారు.రీసెంట్ గానే ఎన్టీఆర్ కూడా ఈ మూవీ షఉటింగ్ లో పాల్గొన్నారు. దీంతో ఈ సినిమా కూడా కేజీఎఫ్, సలార్ సినిమాల కంటే కూడా భారీ హిట్ అవుతుందని అంచనా వేస్తున్నారు.ఈ సినిమాలోనే మమిత ఛాన్స్ కొట్టేసిందని సోషల్ మీడియా కోడై కూస్తుంది. మూవీలో ఓ కీలక పాత్ర కోసం మమితను తీసుకున్నారని టాక్ నడుస్తోంది. దీంతో ప్రశాంత్ నీల్ %-% తారక్ ప్రాజెక్టులో మమిత నటించడం అంటే పెద్ద ఆఫర్ ఏ అని ఆమె ఫ్యాన్స్ తెగ మురిసిపోతున్నారు. అయితే దీని గురించి అధికారికంగా ఎలాంటి అనౌన్స్ మెంట్ రాకపోయినప్పటికీ త్వరలోనే రావొచ్చు అని భావిస్తున్నారు. ప్రస్తుతం మమిత దళపతి విజయ్ నటిస్తున్న జన నాయగన్ సినిమాలో నటిస్తోంది. అలానే పలు సినిమాల్లో సైతం నటిస్తూ బిజీగా ఉంది ఈ ముద్దుగుమ్మ. ఇక ఈ సినిమా కోసమే దాదాపు ఐదు నెలల్లోనే ఎన్టీఆర్ సుమారుగా 18 కేజీల బరువు తగ్గారని అంటున్నారు. రోజుకు మూడు గంటల పాటు వర్కౌట్ చేసి, ఫ్యాట్ ఎంకరేజ్ చేయకుండా హై ప్రోటీన్స్ తో ఎన్టీఆర్ డైట్ ను పాటించారని చెబుతున్నారు. దీంతో ఎన్టీఆర్ బాగా బరువు తగ్గి పోయారని తెలిపారు. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో వస్తున్న ఈ ప్రాజెక్టు ఇప్పటికే భారీ అంచనాలు నెలకొల్పుకుంది. 'కేజీఎఫ్', 'సలార్' వంటి బ్లాక్ బస్టర్ సినిమాలను ఇచ్చిన ప్రశాంత్ నీల్ తో పాటు, ఎన్టీఆర్ వంటి స్టార్ హీరో కలిసి పనిచేయడం సినిమాకు హైప్‌ను మరింత పెంచింది. ఇలాంటి క్రేజీ ప్రాజెక్టులో మమితకు అవకాశం రావడం అంటే నిజంగా గొప్ప విషయమే. ఇది మమిత కెరీర్‌కు మైలురాయిగా మారే అవకాశం ఉందని ఆమె అభిమానులు భావిస్తున్నారు.ఈ ప్రచారం నిజం అయితే, మమిత కెరీర్‌లో ఇది గేమ్ ఛేంజర్ అవుతుందని నిశ్చయంగా చెప్పొచ్చు. అభిమానులు మాత్రం ఇప్పటికే సోషల్ మీడియాలో మమితకు విషెస్ వస్తున్నాయి. అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సి ఉన్నా, ఇప్పటి వరకు వచ్చిన సంకేతాల ప్రకారం మమిత భవిష్యత్తు చాలా బ్రైట్‌గా కనిపిస్తోంది.

TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339